honeybee.org

Vol-7 Issue-1

సంపుటి 7 సంచిక 1 నవంబర్-డిశంబర్ 2018

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక








# కనిపించినదానికన్నా ఎక్కువ చూడటం



చాలా తీవ్రంగా జబ్బుపడ్డ ఇద్దరు రోగులు ఒకే ఆసుపత్రియందలి ఒకే గదిలో వుండేవారు. అందులో ఒకరోగికి మాత్రం ఆయన ఊపిరితిత్తుల్లోని ద్రవాలు బైటకి రావటం కోసం రోజుకు ఒక గంటసేపు మంచంమీద కూర్చోనిచ్చేవారు. ఆ గదికి వున్న ఒకేవొక కిటికీ అతని మంచం ప్రక్కనే ఉండేది. రెండోవాడు మాత్రం రోజంతా మంచంమీద పడుకుని ఉండేవాడు.

వాళ్ళిద్దరూ గంటలకొద్దీ మాట్లాడుకునేవారు. వాళ్ళ భార్యలు, పిల్లలు, ఇల్లు, ఉద్యోగాలు, వాళ్ళు సైన్యంలో పనిచేసిన రోజులు, సెలవులు .... ఈవిధంగా కాలం గడిపేవారు. కిటికీ ప్రక్కన కూరన్చునే అవకాశమున్న రోగి కాలక్షేపం కోసం బైట ఏం జరుగుతోందో చూసి తన స్నేహితుడికి వివరిస్తూ ఉండేవాడు. అతను ఈ గంటకోసమే జీవించేవాడు. బైట జరిగే సంఘటనలు, ఆ రంగుల ప్రపంచం గురించి విని, అతని మనస్సు ఊరట పొందేది. కిటికీ ప్రక్కనే ఒక ఉద్యానవనం, దానిపక్కగా ఒక కొలను ఉండేవి. బాతులు, హంసలు దాంట్లో ఈదుతూ ఆడుకుంటూ వుండేవి. పిల్లలు రంగురంగుల కాగితం పడవలు చేసి, నీళ్ళల్లో వేసి ఆడుకునేవారు. ఇంద్రధనస్సు రంగులో వుండే పూపొదల మధ్య యువ ప్రేమికులు చేతులు పట్టుకుని నడుస్తూ వుండేవారు. ప్రక్కనే పెద్ద వృక్షం ఉండేది. దూరంగా ఊరు కనిపిస్తూ వుండేది. కిటికీ ప్రక్కనున్న రోగి ఈ వివరాలన్నీ చెపుతూ వుంటే ప్రక్కనున్న రోగి కళ్ళు మూసుకుని అవన్నీ చిత్రాలుగా ఊహించుకొని ఆనందించేవారు. ఒకరోజు కిటికీ ప్రక్కనున్న రోగి బైట జరుగుతున్న కవాతు గురించి వివరించాడు. పడుకున్న రోగి ఆయనకి బ్యాండు సంగీతం వినిపించకపోయినా తన కళ్ళెదుట జరుగుతున్నట్టే వివరిస్తూ వుంటే తానే చూసినంత ఆనందపడిపోయాడు. ఇలా రోజులూ వారాలు గడిచిపోయాయి.

ఒకరోజు వారి స్నానానికని నీళ్ళు తెచ్చిన నర్సు కిటికీ ప్రక్కనున్న రోగి మరణించి వున్నట్లు గమనించింది. అతను నిద్రలోనే ప్రశాంతంగా చనిపోయాడు. అమెకూ చాలా బాధేసింది. ఆస్పత్రి సహాయకులతని శవాన్ని తీసివేయటానికి పిలిపించింది. శవాన్ని తీసేశారు. మంచం ఖాళీ అయింది. సరైన సమయం చూసి పడుకుని ఉండే రోగి తన కిటికీ ప్రక్కనున్న మంచంపైకి మారవచ్చునా అని నర్సుని అడిగాడు. ఆమె సంతోషంగా ఒప్పుకుంది. అతన్ని కిటికీ ప్రక్కన వున్న మంచంమీదకి మార్చింది. అతడికి అన్ని సదుపాయాలు చేసి వెళ్ళిపోయింది. ఆమె అటు వెళ్ళిపోగానే ఇతను చలా కష్టంమీద మోచేతులమీద వత్తిగిలి కిటికీలోంచి చూడాలని ప్రయత్నించాడు. చివరికి తనకున్న శక్తినంతా కూడగట్టుకుని ఇంతవరకు విన్నదంతా తాను స్వయంగా చూసే అవకాశం వచ్చినందుకు ఉత్సాహంగా ఉన్నాడు. మెల్లిగా కిటికీవైపు తిరిగి కిటికీలోంచి చూశాడు. ఎదురుగా పెద్దగోడ అడ్డంగా వుంది. తన చనిపోయిన మిత్రుడు కిటికీలోంచి చూశాడు. ఎదురుగా పెద్ద గోడ అడ్డంగా వుందేమిటా అని నర్సుని పిలిచి, తన చనిపోయిన మిత్రుడు కిటికీ బైటవున్న ప్రపంచాన్ని అంత అందంగా వర్ణించడానికి గల కారణం ఏమిటని అడిగాడు.

**ఆమె సమాధానం ఏమై వుంటుంది? వాస్తవం తెలిసి కూడా చెప్పలేని పరిస్థితిలో ఉండిపోవాలా? ఒక ఇన్నోవేటర్‌కి అతని ఇన్నోవేషన్ మార్కెట్లో విజయం సాధిస్తుందో లేదో అన్న వాస్తవం తెలిసి కూడా మనం గుడ్డివారిలా ఉండిపోవాలా? (లేని ఆశలు కల్పించాలా?) కిటికీ బయట మనం చూస్తున్న చిత్రం (వాస్తవం) ఎప్పటికైనా మారుతుందా? ఎప్పటికైనా మనం చూసిన దానికి, చెప్పినదానికి పొంతన కుదురుతుందా?**

– హనీబీ 18(3& 4) – 2007

Vol-7, Issue - 1 November-December 2018



# పల్లెసృజన

సంపుటి-7 సంచిక - 1 నవంబర్-డిశంబర్ 2018

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

## సంపాదకవర్గం

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్మలమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 800/-**
**for 5 years Subscription**

## విషయ సూచిక



3 విజయ రామరాజు 'విజయగాథ'



18 నీతులు మాటల్లో కాదు ఆచరణలో చూపుతున్న 'లింగాల కేదారి'



6 అండమాన్ నికోబార్ దీవులలో 41వ శోధయాత్ర



22 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలు బహుమతి పొందిన ఇన్నోవేషన్లు



26 ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు



13 జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు



30 ఆయుర్వేద జ్ఞాన మథనం చక్కెర భయంకరమైనది - బెల్లం ఆరోగ్యకరమైనది

కవర్ లోపలి పేజీల్లో... **కనిపించినదానికన్నా ఎక్కువ చూడటం** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : **'పల్లెసృజన' పాల్గొన్న ప్రదర్శనలు - ప్రశంసలు**

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# సమసమాజం నిర్మిద్దాం !

కాలగమనంలో మరో మెట్టు 2018 మగిసి ముందుకు అడుగు వేస్తున్నాం. 2005లో ప్రారంభించిన 'పల్లెసృజన' సంస్థ, గ్రామ ప్రజలతో మమేకమై వారిలో దాగున్న క్రియాశీలతను, సాంప్రదాయ జ్ఞానాన్ని వెలుగులోకి తేవడానికి స్వచ్ఛందంగా కృషి చేస్తూ వచ్చింది. ఈ జ్ఞాన ప్రస్థానంలో పల్లెసృజన గ్రామ వ్యవస్థను, ప్రకృతి అందిస్తున్న వనరులను, ప్రజల నైపుణ్యాన్ని, వ్యవస్థ గ్రామాలకు ఇస్తున్న చేయూత పద్ధతులను, అభివృద్ధి పథాన్ని వేగంగా మారుతున్న నవ యువత ఆశలు, ఆకాంక్షలు, సాంకేతికత తెస్తున్న సునామీలాంటి మార్పులను పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ అవగాహన చేస్తూ ముందుకు సాగుతోంది.

రాను రాను గ్రామాల్లో జీవితం చాలా క్లిష్టంగా తయారవుతోంది. ప్రకృతిపైన పూర్తిగా ఆధారపడి జీవించడం ఎప్పుడో పోయింది. ఇప్పుడు సైన్సు, టెక్నాలజీ, ప్రజల జీవితాలను, ఆలోచనలను ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. అంటే గ్రామస్తులు తమకు ఏమాత్రం అవగాహన లేని టెక్నాలజీపై ఆధారపడి జీవనం సాగించడం అలవాటు చేసుకున్నారు. అందుకే స్వయంగా నిర్ణయాలు చేసుకోలేక ఎవరో చేసింది, ఎవరో చెప్పింది విని తాము ప్రయోగాలు చేస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లాలో జరిగిన 29వ శోధయాత్రలో సరస్వతీనగర్ గ్రామంలో గోపాలాచారి అనే రైతు తన ఆవేదనను యాత్రీకులతో పంచుకున్నాడు. 'విత్తనాలకై మేము మహబూబాబాద్‌కు పోతే అక్కడ పది విత్తనాల కంపెనీలు మమ్మల్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తాయి. వ్యవసాయాధికారులు మాకు సరియైన సలహా ఇవ్వరు. ఈ పరిస్థితుల్లో ఏది సరైనదో తెలుసుకునే మార్గం మాకు కనిపించదు. గుడ్డిగా ఏదో విత్తనం కొంటాం, ఇది పూర్తి రిస్కు మాకు. డబ్బు పెట్టాం, విత్తనాలు మొలుస్తాయో లేదో తెలియదు. మొలిస్తే అదృష్టవంతులుగా భావిస్తాం, మొలవకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియదు. ఏ కంపెనీ వాళ్ళు కాని, వ్యవసాయ అధికారులు కాని బాధ్యత వహించరు. రైతుగా నీవే ఏదో తప్పు చేసుంటావు అంటారు. పంట పోయింది. విత్తనాలకు పెట్టిన డబ్బుపోయింది, ఇదీ మా పరిస్థితి" అని వాపోయాడు. పక్కనున్న మరో పదిమంది రైతులు ఆయనను సమర్థించారు. వారుకూడా ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్నామని చెప్పారు.

సమర్థమైన సాంకేతిక జ్ఞానంతో అభివృద్ధి పథంలో విశ్వాసంగా ముందుకు సాగుతున్న భారతదేశ వ్యవస్థ రైతులకు సరైన మార్గదర్శకత్వం చేయలేక పోతున్నదా? ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, సాంకేతిక పరిశోధనా శాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు ఇవన్నీ కోట్లాదిమంది రైతులకు సరైన అవగాహన కల్పించలేక పోతున్నాయా? రైతుల అవసరాలను గుర్తించి, వారికి అర్థమయ్యే భాషలో సరైన సలహాలిస్తూ వారిని అభివృద్ధిపథంలో నడుపుతూ ఆనందంగా జీవించటానికి ప్రయత్నాలు చేయాలి.

ఇప్పుడున్న పరిస్థితులు మారాలంటే, ప్రభుత్వం ప్రజలకు ఏం కావాలో, ప్రతి ప్రాంతానికి, ప్రతి పంటకు, దున్నడం నుండి మార్కెట్ చేరే వరకు స్థానిక వనరులను ఉపయోగించుకునేలా సాంకేతికతను చూపాలి. గ్రామ ప్రజలు సులభంగా వాడగలిగే పరికరాలు, యంత్రాలు, నిల్వ చేసే పద్ధతులు, పంటకు విలువను పెంచే పరికరాలను తయారు చేసి, వాటిని ఆయా ప్రాంతాల్లోనే పరీక్షించి సమకూర్చాలి. అంతే కాకుండా ఇలాంటి పరికరాలు స్థానికంగా ఉత్పత్తి చేసేటట్లుగా యువతను ప్రోత్సహించాలి. ప్రతి గ్రామ సాంకేతిక అవసరాలను వేరువేరుగా విశ్లేషించాలి. ఈ డాటాబేస్‌ను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి. అప్పుడే సమాజంలోని అందరూ పరిష్కారాలతో ముందుకు వచ్చే అవకాశం వుంటుంది. సమాజంలోని ప్రతి ఒక్కరూ గ్రామాలు మావి, గ్రామ ప్రజలు మావాళ్ళు, వారి కష్టాలే మా కష్టాలు, వారి ఆనందమే మా ఆనందం, వారు కన్నీరు పెడితే మాకందరికీ కలత, వారు ఆత్మహత్య చేసుకుంటే మన కుటుంబ సభ్యుడు పోయినంత బాధ అనుకున్ననాడే రైతు వికాసానికి మార్గం ఏర్పడి సమసమాజానికి నాంది పలకవచ్చు.

సమీప భవిష్యత్తులో 'పల్లెసృజన' ఈ అంశంపై ప్రధానంగా కృషి చేస్తుంది. సమాజంలో అన్ని వర్గాలను అనుసంధానం చేయడానికి ప్రయత్నిస్తుంది. వారి సామర్థ్యాన్ని, వారి దేశ ప్రేమను, వారిలోని సామాజిక స్పృహని ఏకం చేసి గ్రామ ప్రజల కళ్యాణానికై వారు సంతుష్టులై జీవించడానికి ప్రత్యేక కృషి చేస్తుంది. ఈ యజ్ఞంలో పాల్గొనడానికి పల్లెసృజన మీ అందరినీ ఆహ్వానిస్తోంది.

నూతన సంవత్సర శుభాకాంక్షలతో....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)





# ఉద్యోగంకన్నా 'ఉపాధి మేలు'
# విజయ రామరాజు 'విజయగాథ'

- పల్లె వీరరాఘవ రెడ్డి

మనిషి జీవించే క్రమంలో మన పూర్వీకులు ఆచరించిన పద్ధతులే నేడు పునరావృతం అవుతున్నాయి అనిపిస్తోంది. అయితే ఇది ప్రధానంగా గ్రామీణ వ్యవస్థలోనే చోటు చేసుకోవటం, దాన్ని పట్టణ సమాజం ప్రోత్సహించడం ఒక శుభ సూచకమనే చెప్పవచ్చు. ఉదాహరణకు ఇప్పుడు వ్యవసాయ విధానంలో పరిపూర్ణంగా పూర్వ పద్ధతులను పాటించటాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారన్నది నిర్వివాదాంశం దానికి ప్రత్యక్ష ఉదాహరణే దినదినాభివృద్ధి చెందుతున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులు. అలాగే నాడు ఒక మోస్తరు మోతుబరి తన పిల్లలను ఉద్యోగాలకు పంపాలంటే పెద్దగా ఇష్టపడేవాడు కాదు. "నువ్వు వున్న స్థితి ఏంటి ఎవడి కిందో పోయి ఉద్యోగం చేయటం ఏమిటి? ఇక్కడ నువ్వే పదిమందికి ఉద్యోగాలిస్తున్నావు, అలాంటిది నువ్వెళ్ళి ఇంకోడి క్రింద పనిచేయటం ఎందుకు?" అని ప్రశ్నిస్తే ఉద్యోగం మానుకుని తన వ్యవసాయ పనులు చూసుకున్న నాటి యువత ఎంతోమంది వున్నారు. అంటే ఇక్కడ ప్రస్తుత సమాజం గుర్తించాల్సిన అంశం ఒకటుంది. "రైతేరాజు" అన్న మాట నాటి గ్రామస్తుల నరనరాల్లో జీర్ణించుకుపోయి వుండేది. దాన్ని నిజం చేయటానికా అన్నట్లు నేడు ఎందరో విద్యాధికులైన యువతీ యువకులు చదువుకున్నోడికన్నా రైతే మేలు అని నిర్ణయించుకొని తమ అత్యున్నత స్థాయి ఉద్యోగాలను సైతం వదిలిపెట్టి తన గ్రామంలోనే వ్యవసాయం చేసుకునేందుకు ముందుకు రావటం, తమ మేధస్సుతో గ్రామాల్లోనే వ్యవసాయ ఆధారిత వ్యాపార పద్ధతులను కనిపెట్టి ఆనందంగా జీవితాలను కొనసాగించటమే కాక, ఇతరులకీ మార్గదర్శకంగా మారుతున్నారు.

ఈ కోవకు చెందిన వాడే నేటి మన కథానాయకుడు గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, వడ్లమూడి గ్రామానికి చెందిన క్రిష్ణవేణి, సాంబ శివరావుల పుత్రుడు 26 సంవత్సరాల యువకుడు 'మొగసాటి విజయ రామరాజు'. ఇతను పదవ



తరగతి చదివిన తర్వాత తన ఆర్థిక స్థోమత దృష్ట్యా పై చదువులు చదవలేక 'ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ'లో డిప్లమా చేశాడు. ఇటీవలే రెండు నెలల క్రితమే వివాహమైంది. తనకున్న చదువుతో ఎక్కడికి వెళ్ళి ఉద్యోగం చేయాలన్నా ఐదారు వేలకు మించి జీతం వచ్చేలా లేదు, అవి తన ఇంటి బాడుగ, ఖర్చులకు సరిపోవు. అని ఆలోచించి, తనకున్న పరిజ్ఞానంతో తన గ్రామంలోనే ఉపాధి మార్గాన్ని గురించి ఆలోచించాడు విజయరామరాజు.

సాధారణంగా గుంటూరు జిల్లాలో ప్రతి రైతు పొలం గట్ల వెంబడి, ఇంటి పెరట్లలో పదో, ఇరవయ్యో కొబ్బరి చెట్లను పెంచుకోవటం ఆనవాయితీగా వుంది. వాటిద్వారా వచ్చే కొబ్బరి కాయలను అమ్ముకునేంతగా పంట వుండదు, కానీ తమ కుటుంబ అవసరాల కోసం వాటిని వినియోగించు కుంటూ వుంటారు. ఏ ఉపాధి ఎన్నుకోవాలా అని ఆలోచిస్తున్న సమయంలో తన గ్రామానికి సమీపంలో వున్న 'తెనాలి' పట్టణానికి కొందరు తమ కొబ్బరిని తీసుకు వెళ్ళి గానుగల్లో నూనె ఆడించుకుని రావటం గమనించాడు. అప్పుడు తనకు తోచింది....."గ్రామస్తులకు తమ ఇంటివద్దనే స్వచ్ఛమైన నూనెలను అందించేలా చేస్తే అదే తనకు ఆదాయ మార్గం అవుతుంది" అని.

తమ ప్రాంతంలోని ప్రతి గ్రామీణుడు తమవద్ద వున్న కొబ్బరిని పట్టణానికి తీసుకువెళ్ళి నూనె తెచ్చుకుంటున్నారు కదా, అలా వారు పట్టణాలకు వెళ్ళకుండా తానే ఒక మొబైల్ ఆయిల్ మిల్‌ను ఏర్పాటు చేసుకుంటే ఉభయ కుశలోపరిగా తనకు ఆదాయం, వారికి స్వచ్ఛమైన నూనె తమ కళ్ళెదురుగానే తీసుకునే అవకాశం లభిస్తుంది కదా అని ఆలోచించాడు. ఇంటివద్ద వుంటూ, తన కుటుంబానికి సహాయకారిగా వుంటూనే, తను వ్యాపారం చేసుకోవచ్చు అనుకున్నాడు. తన గ్రామానికి పది కిలోమీటర్ల పరిధిలోని చుట్టుపట్ల గ్రామాలే తన వ్యాపారానికి పరిధిగా ఎన్నుకున్నాడు.

సమీప పట్టణంలో కొబ్బరిని నూనెగా మార్చే మినీ ఆయిల్ మిల్‌ను కొని, దాన్ని డీజిల్ ఇంజన్‌తో పనిచేసేలా చేసి, ఒక ఆటోలో ఏర్పాటు చేసుకున్నాడు. దీనికి సంబంధించిన విధానం తనకెవరూ చెప్పలేదు, మిలట్రీలో పనిచేసే తన బాబాయ్ చేసిన ఆర్థిక సహాయంతో దాదాపు 2 లక్షల 30 వేల దాకా ఖర్చు చేసి ఒక సెకండ్ హ్యాండ్ ఆటోను, ఆయిల్ మిల్‌ను కొని, మరో డీజిల్ ఇంజన్‌తో ఆయిల్ మిల్ నడిచేలా ఏర్పాటు చేసుకున్నాడు. మొదట్లో కొన్ని ఇబ్బందులు పడ్డా రానురాను ఆ ఇబ్బందులను అధిగమించి, మొత్తానికి ప్రస్తుతం నిరాఘాటంగా తన 'మొబైల్ ఆయిల్ మిల్'ను సమీప గ్రామాల్లో



సంచరిస్తూ ఆదాయ మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నాడు.

ఈ యంత్రం సామర్థ్యం రోజుకి 30నుండి 40 కిలోల వరకు కొబ్బరిని నూనెగా మార్చే శక్తి కలది. ఒక కిలో కొబ్బరికి 600 గ్రాముల వరకు నూనె వస్తుంది. ఒక కిలో కొబ్బరిని నూనెగా మార్చటానికి రూ. 40 రూపాయలు తీసుకుంటాడు రామరాజు. అయితే ఇందులో కొందరు రైతులు నూనెను తియ్యగా వచ్చిన కొబ్బరి పిప్పిని తీసుకు వెళ్తారు. దీన్ని పశువులకు వేస్తే అవి ఇచ్చే పాలల్లో వెన్న శాతం పెరుగుతుందని దాన్ని వారి పశువులకు దాణాగాను, మరి కొందరు తమ వంటకాల్లో వినియోగించుకుంటారు. అటువంటి అవసరం లేని వారు ఈ పిప్పి మాకవసరం లేదు మీరే తీసుకోండి అన్నపుడు వారికి 30 రూపాయలకే కొబ్బరి నూనె తీసి ఇస్తుంటాడు. ఆ తర్వాత తనకు పోగైన కొబ్బరి పిప్పిని హోటళ్ళు, డెయిరీ ఫారాల్లో కిలో 40 రూపాయల చొప్పున అమ్మేసుకుంటూ వుంటాడు. ఈరకంగా తనకు కొంత అదనపు ఆదాయం కూడా వస్తూ వుంటుంది. నూనెకు వచ్చే వారివద్ద కూడా కనీసం 5 కిలోల కొబ్బరి వుంటేనే ఆడిస్తానని, అంతకన్నా తక్కువ వుంటే ఆడించటం కుదరదని అంటాడు రాజు. గ్రామీణులు కూడా బయటి మార్కెట్లో కల్తీ నూనె కొనేదానికన్నా, తమ కళ్ళెదురుగా, తమ కొబ్బరితో తయారయ్యే నూనెనే ఉపయోగించుకుంటున్నామన్న తృప్తితో ఈ విధానానికే మొగ్గు చూపుతున్నారన్నాడు.

నూనెల్లో కల్తీ జరగటం తప్పనిసరి అన్నదానికి తనకున్న పరిజ్ఞానాన్ని వివరించాడు విజయరామరాజు. ఒక కిలో వేరుశనగను గానుగ ఆడిస్తే 600 గ్రాముల దాకా నూనె వస్తుంది, ఒక కిలో వేరుశనగ విత్తనాలు ప్రస్తుతం మార్కెట్లో 120 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. మరి అదే 120





రూపాయలకు కిలో నూనె ఎలా ఇస్తారు? అందులో ఏదో ఒక కల్తీ చేయనిదే ఇదెలా సాధ్యమవుతుంది అంటాడితను. కాబట్టే తన ఆయిల్ మిల్లుకు గ్రామాల్లో మంచి ఆదరణ లభించిందని, తాము స్వచ్ఛమైన నూనెను వినియోగించుకుంటున్నాము అన్న తృప్తితో గ్రామీణులు ఉన్నారని అంటాడు విజయరామరాజు.

ఈ పనులన్నీ తానొక్కడే చెయ్యలేడు కాబట్టి కొన్ని పనులను చేయటానికి తాను రోజుకు రూ. 300/–లు చెల్లిస్తూ ఒక ఉద్యోగస్తుడిని నియమించుకున్నాడు. తన ఖర్చులన్నీ పోగా సరాసరిన రోజుకు ఐదారు వందలు మిగులుతుంది. ఈరకంగా చూసుకుంటే తనకు నెలకు రూ. 15,000/–కు పైగా ఆదాయం వచ్చినట్టే కదా! ఒకరికింద పని చేయటానికన్నా తనకు తాను సంపాదించుకోవటమే కాక, మరొకరికి కూడా జీవనోపాధి కల్పిస్తున్నాను అన్న ఆలోచన తనకు ఆనందంగా వుందని చెబుతాడు విజయరామ రాజు. ఈవిధంగా తనకు తానుగా సృష్టించుకున్న వ్యాపారంతో దినదినాభివృద్ధి చెందుతున్నాడు.

తమ ప్రాంతంలో కొబ్బరిచెట్లు కాస్త తక్కువే అయినా రోజుకు 50 కిలోల దాకా కొబ్బరిని నూనెగా మార్చి ఇస్తున్నానని, అదే కొబ్బరిచెట్లు ఎక్కువగా వున్న ప్రాంతాల్లో అయితే ఇంకా మంచి ఆదాయం వుంటుంది అంటాడితను.

విజయరామరాజు చూపిన చొరవను అందరు యువకులూ పాటించి, తమ గ్రామాల్లోని సమస్యలకు తామే పరిష్కార మార్గాలు చూపుతూ, తద్వారా స్వయం ఉపాధి పొందుతూ, ఇతరులకి కూడా ఉపాధి కల్పించ గలిగితే 'అభ్యుదయ యువత' అన్న పదం తప్ప, 'నిరుద్యోగ యువత' అన్న పదమే ఉండదని భావిస్తోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ విజయరామరాజు ఫోన్ నెం.: 8328110800**

# అండమాన్ నికోబార్ దీవులలో 41వ శోధయాత్ర

## (ప్రకృతి స్పందిస్తుంది - ప్రకృతి పరిష్కరిస్తుంది)



- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**(మీకెప్పుడైనా చిన్నపిల్లల ఆట వస్తువులు ఇంటి పనులలో సహాయపడతాయి అనిపించిందా? పదవ తరగతి చదువుతున్న శుభ్రతో దాస్ తాను ఆడుకునే బొమ్మ కారుకి చీపురును జత చేయటం ద్వారా తాను ఆడుకుంటూనే ఇంట్లోని మారుమూల ప్రాంతాల్లో ఊడ్చివేసి, తల్లికి సహాయపడుతూ వుంటాడు. 2018వ సంవత్సరం ఏప్రిల్ 23 నుండి 28 వరకు అండమాన్ నికోబార్ దీవులలో జరిగిన 41వ శోధయాత్రలో యాత్రీకులకి ఇటువంటి ఎన్నో ఉత్సుకత, ఆశ్చర్యాన్ని రేకెత్తించే అనుభవాలు, ఆలోచనలే కాక, ఎన్నో మూలికా వైద్య చిట్కాలు, సాంస్కృతిక వైవిధ్యం, సాంప్రదాయ జ్ఞానం అనుభవంలోకి వచ్చాయి. జార్ఖండ్, మునుపటి తూర్పు బెంగాళ్ (తూర్పు పాకిస్తాన్), ఇప్పటి పశ్చిమ బెంగాళ్, మాయమ్నార్ లాంటి ప్రదేశాల నుండి వలస వచ్చినవారు ఈ ద్వీపాల సంస్కృతీ, పర్యావరణ అందాలకి మెరుగులు దిద్దారు. స్థానికంగా తరతరాల నుంచి ఈ దీవులలో నివసించే జర్వాస్, ఓంగీ తదితర తెగలకు చెందిన వారితో సందర్శకులు కలిసే ప్రయత్నాలు చేయకూడదని మాటిమాటికీ హెచ్చరికలు జారీ చేశారు.)**

ఈ 41వ శోధయాత్ర ఉత్తర అండమాన్ లోని 'డిగ్లీపూర్' నుండి మధ్య అండమాన్ లోని 'వేబీ' వరకు మొత్తం 120 కిలోమీటర్ల దూరం వరకు సాగింది. యాత్ర ప్రారంభం కాకముందునుంచే మైకులలో యాత్రీకులెవ్వరూ స్థానికంగా నివసించే 'జార్వాస్' మొదలైన తెగల వారు ఎదురైతే వారికి ఏవిధమైన బహుమతులు, ఆహార పదార్థాలు ఇచ్చి వారిని ప్రలోభపెట్టి పరిచయాలు పెంచుకునే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించటం జరిగింది. 'జార్వాస్' లతోపాటు ఈ ద్వీపాలలో 'నికోబారీ'లు, 'సెంటెనల్స్' మరియు 'ఉంగీ' తెగవారు నివసిస్తున్నారు. ప్రభుత్వం ఇటువంటి వారి ప్రత్యేక ఉనికిని కాపాడటానికి వీరితో బైటివారెవ్వరూ సంపర్కం పెంచుకో కూడదని కొన్ని రక్షక చట్టాలను అమలు చేస్తున్నారు. వీరిని సాంఘికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా మోసం చేయ కుండా ఉండటానికై వారి ఫొటోలు తీయకుండా నిషేధించడమైనది. వారి సాంప్రదాయాలను రక్షించటం కోసం వారిని వెలివేసినట్లుగా విడిగా ఉంచే చట్టాలు ఒకటే మార్గమా అన్న సందేహం కొందరు యాత్రీకులకు కలిగింది. కాకపోతే గతంలో వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారికి చిన్న చిన్న వస్తువులు, ఆహారంతో మభ్యపెట్టి, వారిని సాంఘికంగా, సాంస్కృతికంగా మోసం చేసి లాభపడిన వ్యక్తుల ఉదంతాలు విన్న తర్వాత ఇటువంటి వ్యక్తుల బారినుండి వారిని కాపాడాలంటే వారికై ప్రత్యేక రక్షణ చట్టాలు అమలు చేయటమే ఉత్తమమని అనిపించినా, ప్రభుత్వ చర్య చర్చనీయాంశంగానే ఉండిపోయింది.

ఈ ద్వీపాలలో స్థానిక జాతులతో పాటు, బాంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, మయమ్నార్ మొదలైన ప్రాంతాల నుండి వచ్చిన వ్యక్తుల సాంస్కృతిక ప్రభావం కనిపిస్తుంది. స్థానికులతో కలిసి వారు ఈ ప్రాంత సాంప్రదాయాలను, సంస్కృతిని సుసంపన్నం చేశారు.

ఈ శోధయాత్ర 'రాధానగర్' గ్రామం నుండి





మొదలైంది. ఇక్కడ మాకు అండమాన్‌లోని అతి పిన్న వయస్సులో సర్పంచ్ అయి, ఈ ప్రాంతంలో మంచి పేరు గడించిన అధ్యాపకుడు, చంచల్‌రాయ్ గారి శిష్యుడు అయిన 'భాస్కర్ మజుందార్'ను కలిసే అవకాశం లభించింది. చిన్నవాడైనా ఇతను ఉత్సాహవంతుడైన నాయకుడు. లంచ రహిత వ్యవస్థ రూపకల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నాడు. "నేను ప్రజలనుంచి లంచం తీసుకుంటే రేపు పదవినుండి దిగి పోయిన తర్వాత వారిని ఏ మొహంతో కలవను?" అంటాడు.

**ప్రోత్సహించే అధ్యాపకులు - సృజనాత్మకత కలిగిన విద్యార్థులు :**

స్థానికంగా మంచి అధ్యాపకుడు అని ప్రఖ్యాతి సంపాదించిన 'చంచల్ సింఘా రాయ్' గారు 'కోస్టల్ గ్రీన్ జోన్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. దీని ద్వారా ఆయన పర్యావరణ పరిరక్షణకి, జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి అనేక కార్యక్రమాలు చేపడుతూ వుంటారు. అసలు అండమాన్ నికోబార్ దీవులలో ఈ 41వ శోధయాత్ర జరగటానికి మూల కారణమై, అన్ని ఏర్పాట్లు చేయటమే కాక, తానూ తన తన ఐదుగురు శిష్యులతో శోధయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఉద్యోగం చేస్తున్న డిగ్లీపూర్ ప్రభుత్వ పాఠశాల నుండే మా శోధయాత్ర ప్రారంభమైంది. ఆయన తన విద్యార్థులలో క్రమశిక్షణ, నిబద్ధత, సృజనాత్మకతలను పెంపొందించటానికి చాలా ప్రయాస పడుతున్నాడు. దానికి సాక్షీభూతం ఏమిటంటే ఆయనతోపాటు ఈ శోధయాత్రలో పాల్గొన్న ఐదుగురు విద్యార్థులలో ఇద్దరు 'దీపాంకర్ దాస్', 'సుమిత్ బిస్వాస్'లు వరుసగా 2015, 2016 సంవత్సరాలలో జాతీయ స్థాయిలో 'ఇగ్నైట్' బహుమానాలు పొందినవారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు కూడా ఔత్సాహిక ఇన్నోవేటర్లే. వారిలో ఒకతను శుభ్రతోదాస్ తమలపాకుల తోటలలో తక్కువ నీరు వాడటానికై వెదురు బొంగులతో కాలువలు ఏర్పాటు చేశాడు. ప్రణవ్ దాస్ సుమారు 500 రకాల విత్తనాలు సేకరించాడు. అండమాన్ దీవుల వ్యవసాయ శాఖవారు వీరిద్దరి ఇన్నోవేషన్లను వివిధ గ్రామాలలో ప్రదర్శించటానికి తగ్గ ప్రోత్సాహాన్నిస్తున్నారు.

ఈ శోధయాత్ర ప్రారంభం కావడానికి ముందే చంచల్ గారు ఒక చిత్రలేఖనం పోటీని ఏర్పాటు చేశారు. దానిలో విద్యార్థులు ప్రకృతిని ప్రతిబింబిస్తూ అనేక చిత్రాలు గీశారు. 7వ తరగతి చదువుతున్న నివేద అనే విద్యార్థిని చెట్లు చక్కని సందేశం అందించేలా చిత్రించింది. ఆమె ప్లాస్టిక్ వాడటం ద్వారా నీటిలోని జలచరాలే కాక, భూమ్మీద కూడా కాలుష్యానికి కారణమౌతోందని సందేశాత్మక చిత్రం గీసింది. ఆమె ప్లాస్టిక్ సీసాల కుప్ప మధ్యలో చిన్న చెట్టు మొలకెత్తుతున్నట్లు బొమ్మ గీసింది. ఎంతో భావాత్మకమైన చిత్రమది. ఇంకొక విద్యార్థి కంటిలోనుండి కారుతున్న నీటి బిందువులో చేప బొమ్మ వేసింది. ఈ చిత్రం ఆ చేప దృష్టిలో నుండి సముద్ర దృక్పథం వెల్లడిస్తున్నట్లుగా ఉంది. ఈవిధంగా చిత్రలేఖన పోటీల్లో ఎంపికైన కొన్ని చిత్రాలని ఈ శోధయాత్రలో వివిధ ప్రాంతాలలో ప్రదర్శించటం జరిగింది.

శోధయాత్రలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలలో అనేక



చంచల్ రాయ్

ఇతర సందేశాత్మక, ఇన్నోవేషన్ల పోస్టర్లు, కొన్ని నమూనాలను కూడా ప్రదర్శించటం జరిగింది. స్వరాజ్‌గ్రామ్ పాఠశాలలోని విద్యార్థులకి కేవలం ప్రదర్శించటం నచ్చలేదు. స్వయంగా అనుభవించాలని కోరుకున్నారు. వారి కోరికను మన్నించి, యాత్రీకులు చెట్లు ఎక్కే పరికరంతో పాటు కొన్ని ఇన్నోవేషన్లను స్వయంగా వినియోగించి చూసిన తర్వాత వారు సంతృప్తి పడ్డారు. ఈ యాత్రీకుల సందర్శనకు గుర్తుగా విద్యార్థులు వారి పాఠశాల ఆవరణలో యాత్రీకులచే చెట్లు నాటించారు, వారూ నాటారు.

ప్రతి శోధయాత్రలో అప్పటికప్పుడు పాఠశాలలలోని విద్యార్థులకి, రోడ్డుమీద గుంపులకి కూడా ఆలోచనల పోటీలు నిర్వహిస్తూ వుంటాము. ఆవిధంగా ఏర్పాటు చేసిన ఒక ఆలోచనల పోటీలో స్వరాజ్‌గ్రాం ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అంజనా మిస్త్రీ అనే విద్యార్థిని, విద్యార్థులు ధరించే కళ్ళజోళ్ళలో పాఠాలను రికార్డు చేసే కెమెరా లాంటిది వుంటే బావుంటుందని అభిప్రాయ పడింది. 8వ తరగతి చదువుతున్న అమన్ విశ్వాస్ నదులలో ప్రయాణీకులను తీసుకువెళ్ళే పెద్ద పడవల (ఫెరీ)లో డీజిల్ ఉపయోగాన్ని నియంత్రించటానికై బ్యాటరీని, గాలి శక్తిని ఉపయోగించాలని సూచించారు. డీబీ గ్రామ్‌లో మూడో తరగతి చదువుతున్న 'తిపిగరిణి' అనే అమ్మాయి ఇద్దరికన్నా ఎక్కువ మంది పట్టేలా గొడుగులు ఉండాలని, వాటిని వాన





నీటి సేకరణకి కూడా ఉపయోగించుకునేలా ఉండాలని, తనకీ ఆలోచన రాష్ట్రపతి పురస్కార గ్రహీత 'తరణా జాయ్' అనే బాలికను తాను త్రిపుర శోధయాత్రలో కలిసినపుడు వచ్చింది అని చెప్పింది. 'నాబా గ్రామ్' కి చెందిన 'రాహుల్ మండల్' అనే విద్యార్థి వరి, పప్పు ధాన్యాలు మొదలైన వాటన్నింటికి పనికి వచ్చే ఒకే హార్వెస్టర్ ఉంటే బావుండునన్న ఆలోచన చెప్పాడు.

విద్యార్థులు ఇవే కాక పర్యావరణాన్ని రక్షించడానికి ఇంకా ఎన్నో ఉపాయాలు చెప్పారు. సోలార్ ప్యానల్లతో ఇంటి కప్పులు ఉండాలని, వాహనాలకి సోలార్ ప్యానల్లు ఉండాలని, స్కూలు బస్సుల్లో చెత్తబుట్టలు ఉండాలని, ప్లాస్టిక్ సీసాలను పైపులుగా రూపాంతరం చేయాలని, మళ్ళీ మళ్ళీ వినియోగించడానికి వీలయ్యేలా నోటు పుస్తకాలుండాలని చెప్పారు. 'పరంగర' గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 'ప్రభ భెంగారా' అనే విద్యార్థి మనము ఆలుగడ్డ చిప్స్ లాంటివి చేయటానికి ప్లాస్టిక్ కవర్ల స్థానంలో ఆకులు వాడితే పర్యావణాన్ని, ఆరోగ్యాన్ని కూడా కాపాడినవాళ్ళము అవుతామని సూచించారు. 'మోహన్‌పూర్' గ్రామంలో చదువుకునే 'మోహన్ కుమార్ దత్తా' కొత్తరకం ఎలుకల బోను తయారు చేసి అందరినీ ఆకట్టుకున్నాడు.

మా యాత్రలో తర్వాత మజిలీ 'మిలాన్ గ్రామ్' అనే ఊరు. మమ్మల్ని అక్కడికి పదిహేనవ సారి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ గారు తీసుకెళ్ళారు. ఆయన కష్టపడి పనిచేసే తత్వం, అంకితభావం ప్రశంసనీయం. ఆయన క్రమం తప్పకుండా ఒక నిర్ణీత సమయానికి కార్యాలయానికి వచ్చి, ఎటువంటి వివక్షా లేకుండా అందరికీ మేలు జరిగే పనులే చేస్తూ వుంటాడు. ఈ యాత్ర పొడవునా మాకు ఇటువంటి యువ నాయకులు ఎంతోమంది తారసపడ్డారు.

'సుమంతో హల్దర్' పాఠశాల చదువు పూర్తి










చేయకపోయినా, చదవటం, వ్రాయటం రాకపోయినా, వరుసగా ఎన్నోరకాల ఇన్నోవేషన్లు చేస్తూ వున్నాడు. ఎటువంటి యంత్రాన్నయినా చిటికెలో మరమ్మతు చేయగలడు. యంత్రాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో అనేకవస్తువులు, పనిముట్లు తయారు చేశాడు. ఉదా.: రెఫ్రిజిరేటర్లో చెడిపోయిన కంప్రెషర్లతో గాలికొట్టే పంపు, స్కూటర్‌తో చెక్కలు కోసే రంపం లాంటి యంత్రాలు ఎన్నో చేశాడు. నీవు చేసే ఇన్నోవేషన్లలో నీకు నచ్చినవి ఏవి? అని అడిగితే తాను అపురూపంగా చూసుకుంటున్న స్పీకర్లను చూపాడు. దాని నాణ్యత, పనితీరుకు యాత్రీకులు ముగ్ధులైపోయారు. ప్రొఫెసర్ గుప్తా గారు మూడు స్పీకర్లకు అప్పటికప్పుడే ఆర్డరు చేశారు. ఒకటి తన స్వంతానికి, రెండు సెట్లు 'సృష్టి' సంస్థకు అని చెప్పాడు. అతని ఇంటినిండా విరిగిపోయిన, వస్తువులు, వైర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలే కనిపిస్తాయి. అతను ఆనాటినుండి యాత్ర ముగిసేదాకా పాల్గొన్నాడు. అతన్ని చూస్తే చాలా కోపంలో వున్న యువకుడిలా కనిపిస్తాడు. పలకరించి చూస్తే అర్థమయ్యిందేమిటంటే, చిన్నపుడు తాను చేయదలచుకున్నది చేయనివ్వకుండా అడ్డు పడ్డారని తల్లిదండ్రులమీద కోపగించుకొని ఇల్లు వదలి వచ్చేశాడట. తిరిగి ఆ ఇంటికి వెళ్ళనే లేదట! అప్పటినుంచి తన కోపాన్ని (ఉక్రోశాన్ని, నిస్సహాయతని) స్థానిక సమస్యలకి పరిష్కారాలు కనుగొనడం కోసం వెచ్చిస్తున్నాడట. ఇప్పటికీ ఆ సంఘటనని తలుచుకుని బాధపడుతూ వుంటాడు. ఒకవిధంగా చూస్తే ప్రతి ఇన్నోవేటరు దేనిమీదో కోపంతో వున్నవాడే అనిపిస్తుంది. అందరూ సమర్థవంతంగా తమ కోపాన్ని క్రియాశీలకంగా నలుగురికీ ఉపయుక్తంగా ఉండే వస్తువులు తయారు చేయటంలో సఫలీకృతులు కాలేరేమో?.

మా తర్వాతి మజిలీ 'మధుపూర్' గ్రామం. ఇక్కడి ప్రజలు చాలా నైపుణ్యం కలవారు అనిపించింది. ఇక్కడి మహిళలు పాత జీన్ ప్యాంట్లతో చెప్పులు, కొబ్బరి చిప్పలు, పొట్టుతో కళాకాంతులు, వెదురు దుంగలు, ఉన్నితో చేతి కళా వస్తువులు.... ఇలా పనికి రావు అనుకున్న వస్తువులతో ఎన్నో నాణ్యమైన, అందమైన పరికరాలు, కళాఖండాలు తయారు చేశారు. మాలో చాలామంది యాత్రీకులు వారివద్దనుండి ఎన్నో వస్తువులు కొనుగోలు చేశారు. మాయన్మార్ నుండి వలస వచ్చిన 'కారెన్' తెగ వారు వెదురుతో బొమ్మలు చేసే ప్రత్యేకమైన నేర్పరితనం ఉన్నవారిలా కనిపించారు. మార్గంలో ఆర్.కె.గ్రామ్, ఖుదీరాంపూర్ల మధ్య మాకొక కుండలు చేసే కుటుంబం తారసపడింది. వారు చేతితో పింగాణీ వస్తువులు తయారు చేస్తున్నారు. ఇది చూసిన మాకు గుజరాత్‌లో భీం, నాయక్ జాతుల వారు గుర్తుకు వచ్చారు. వారుకూడా మట్టితో పింగాణి వస్తువులు చేయటంలో నేర్పరులు.

ఈ యాత్రలో ఎన్నో ఆరోగ్యకరమైన వంటలు చవిచూశాము. వరంగర గ్రామంలో 'కాంతి ఇందీవర్' అనే విద్యార్థి నార చెట్టు ఆకులతో చేసిన కూర వడ్డించింది. ఇది రక్తశుద్ధికి, రక్తంలో హిమోగ్లోబిన్ వృద్ధి అవటానికి సహకరిస్తుందట. 'కాలాపహాడ్' అనే గ్రామంలో 'వెరోనికా కుజూ' అనే ఆమె బొప్పాయి కాయ కూర తినిపించింది. ఇది








జ్వరాన్ని తగ్గిస్తుందట. మేము ఇంకా తిని తెలుసుకున్న వంటకాలు మునగ ఆకుల కూర రక్తపోటు, మధుమేహం, ఉదర సంబంధ వ్యాధులకు బాగా పని చేస్తుందట. అరటిపువ్వుతో చేసిన కూరలో ఇనుము వుంటుందని, ఇది కడుపు ఉబ్బసానికి కూడా బాగా పని చేస్తుందని, రక్తంలో హిమోగ్లోబిన్ పెంచుతుందని, అరటి ఊట (దూట)తో చేసిన కూరలో కిడ్నీలో రాళ్ళను కరిగించే గుణం వుందని,..... ఇలా ఎన్నో ఆరోగ్యానికి ఉపయోగపడే తినుబండారాలు, కూరల గురించి తెలుసుకున్నాము. ఇవన్నీ పుక్కిటి పురాణాలు కాదని, చాలాభాగం శాస్త్రబద్ధంగా నిరూపితమైనవని మా పాత రికార్డులు చూస్తే తెలిసింది. వరంగర గ్రామంలో పిల్లలు తమతమ తల్లులు, టీచర్లు, అంగన్‌వాడి ఉద్యోగులతో కలిసి అనేక సాంప్రదాయ ఆహార పదార్థాలను ప్రదర్శించి, వాటిగురించి వివరించారు. ఆర్.కె.గ్రాం అనే గ్రామంలో 'దీప్తి బిస్వాస్', ఆమె తల్లిగారు యాత్రీకులందరికీ షడ్రశోపేతమైన విందు వండి, వడ్డించటమే కాక, వంటల పోటీలలో కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

మా తర్వాతి మజిలీ 'కాలా పహాడ్' గ్రామం. ఇది దట్టమైన అడవుల మధ్య ఉంది. స్థానిక అధికారులు ఇక్కడ నివసించే కుటుంబాలను ఆక్రమణదారులుగా పరిగణిస్తూవుంటారు. గత 40 సంవత్సరాలుగా ఈ కుటుంబాలు ఆ ప్రాంతపు జీవ వైవిధ్యం, పర్యావరణ రక్షణకి పాటుపడుతున్నా, వారికి కనీస వసతులైన త్రాగే నీరు, కరెంటు లాంటి సదుపాయాలు అందించే ఏర్పాట్లు చేయటం లేదు స్థానిక యంత్రాంగం. యాత్రీకులు వారితో కలిసి వారి స్థితిగతులను తెలుసుకునే ప్రయత్నం చేశారు. వారితో మాట్లాడటానికి, వారిమధ్య ఆ రాత్రి గడపటానికి, పోటీలు నిర్వహించటానికి అంజనారాయ్ అనే ఉద్యోగిని చాలా శ్రమపడి చక్కని ఏర్పాట్లు చేసింది. మరునాడు ఉదయం అరటి ఆకులలో బెల్లం కలిపిన మొలకెత్తిన గింజలను అల్పాహారంగా ఇచ్చారు. చాలా ఆనందం వేసింది. చాలా ఇళ్ళల్లో సరైన మరుగుదొడ్ల వసతి లేక ఉదయపు కాలకృత్యాలు ఆరుబయట పొలాల్లో తీసుకోవలసి వచ్చింది. పరిస్థితికి బాధవేసినా, ఇదొక కొత్త అనుభవయం యాత్రీకులకి.

యాత్ర పొడవునా స్థానిక మూలికావైద్యులు ఎంతోమంది తమ జ్ఞానాన్ని యాత్రీకులతో పంచుకున్నారు. సమాజంలో ఆరోగ్య వ్యవస్థ పటిష్టంగా లేని సందర్భాలలో ఇటువంటి సాంప్రదాయ వైద్య విధానాలే ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యపాత్ర వహిస్తాయి. చిన్నపిల్లలు కూడా ఆశ్చర్యం గొలిపే వైద్య విధానాలను గురించి చెప్పారు. 'పరంగర' గ్రామంలో 9వ తరగతి చదువుతున్న 'మంతోష్ బిస్ట్' అనే విద్యార్థి 'సయానీ వీడ్' అని స్థానికంగా లభించే కలుపు మొక్కలతో గాయాలను నయం చేయవచ్చని చెప్పాడు. 'రాహుల్ కుమార్' అనే విద్యార్థి 'రణపాల' మొక్క ఆకుల రసం కడుపునొప్పికి బాగా పనిచేస్తుందని చెప్పాడు. 'డిపి గ్రామ్' పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న 'తన్మయ్ మండల్' అనే విద్యార్థి 'చింతచిగురు' తింటే దగ్గు తగ్గిపోతుందని, 'బసేరా బేపారి' అనే విద్యార్థి 'పారిజాతం' మొక్క ఆకుల రసం త్రాగితే జ్వరం తగ్గిపోతుందని, 5వ తరగతి చదువుతున్న 'సుధీప్ డాకువా' అనే విద్యార్థి 'నేలవేము' ఆకుల రసం త్రాగితే కడుపులోని క్రిములు పడిపోతాయని చెప్పాడు. చిన్నపిల్లలు ఆరోగ్యానికి పనికివచ్చే ఇన్ని సాంప్రదాయ జ్ఞాన పద్ధతులను గురించి చెపుతుంటే రాబోయే తరంలో కూడా ఈ జ్ఞానం అంతరించి పోకుండా కాపాడుతున్నందుకు ఆనందం వేసింది. మేము ఈ యాత్రలో సేకరించిన ఈ సాంప్రదాయ వైద్య విధానాలన్నింటిని కూడా గ్రంథస్తం చేసి, మా 'సృష్టి' సంస్థ

యొక్క ప్రయోగ శాలకి తదుపరి నిర్ధారణకై పంపించాము.

## సృజనాత్మక యంత్రాలు :

మా యాత్రా బృందం 'లక్ష్మీపూర్' గ్రామానికి చేరుకునేటప్పటికి అక్కడి సామాన్లు తీసుకునివెళ్ళే రిక్షాలు స్కూటర్ ద్వారా నడిచేవి చాలా కనిపించాయి. వాకబు చేయగా స్థానికంగా నివసించే 'మిథున్' అనే అతను వాటిని తయారు చేశాడని తెలిసింది. కుతూహలంగా అతన్ని కలిసి పలకరించాము. 30 సంవత్సరాల వయసుగల మిథున్ చాలా ఉత్సాహంగా తన సృజనల గురించి చెప్పాడు. అందులో ఒకటి డొల్ల ఇటుకలు తయారు చేసే హైడ్రాలిక్ యంత్రం. చాలా బాగం ఇటుకలు తయారు చేసే యంత్రాలు గుజరాత్‌నుండి తెప్పించుకుంటూ ఉంటారట. అవి చాలా ఖరీదైనవి. ఇలా కాదని మిథున్ తానే స్వయంగా, చవకగా హైడ్రాలిక్ పద్ధతిలో డొల్ల ఇటుకలు చేసే యంత్రాన్ని రూపొందించాడు. అండమాన్ దీవులలో తాను తయారు చేసిన యంత్రాలే ఎక్కువగా వినియోగిస్తున్నారని, ఎందుకంటే అవి బైటనుంచి తెప్పించుకునే యంత్రాలకన్నా చవకైనవని, యంత్రాన్ని తానే తయారు చేశాడు కనక ఎటువంటి మరమ్మతులు వచ్చినా తానే బాగుచేసి ఇవ్వగలను కనక అని చెప్పాడు. అతనే పవర్ టిల్లర్‌కి చిన్న పరికరం తగిలించి, నూర్పిడి యంత్రంగా ఉపయోగపడే ఏర్పాటు చేశాడు. తాను ఇప్పుడు ప్రస్తుతం స్థానికంగా ముఖ్య పంటలైన వరి, పోక చెక్క (వక్క)లకి రెండిటికీ పనికి వచ్చే ఒకే యంత్రాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తున్నాను అన్నాడు.

ఇక్కడే స్థానికంగా ఇంకొక ఇన్నోవేటర్ 'కరెం' తెగకి చెందిన 'సావ్ సాంగ్టో' అనే అతన్ని కలిసి అతని ఇన్నోవేషన్ గురించి తెలుసుకున్నాము. ఇతను స్థానికంగా చేపలు పట్టే పడవకి మోటారు ఇంజను ఏర్పాటు చేశాడట. ఇతరులు కూడా అడుగుతున్నారని, వారికీ చేసిపెడతానని చెప్పాడు. ఇదే తెగకు చెందిన 'సావ్ పేపే' అనే అతను తన స్కూటర్‌కి కొద్దిపాటి మార్పులు చేసి, తన పొలంలో కలుపు తీయటానికి వాడుతున్నానని, తనే ధాన్యం తూర్పారబట్టే యంత్రాన్ని, అనేక పనులకు పనికి వచ్చే ఒక బండిని తయారు చేశానని చెప్పారు. అండమాన్ దీవులలో తరతరాలనుంచి వాడే పొయ్యి వానాకాలంలో కూడా మండేలా రూపొందించబడింది. మేము ఒక బకెట్‌లో ఏర్పాటు చేసిన పొయ్యిని చూశాము.

ప్రభుత్వ సమాచార మరియు ప్రసార శాఖల నాటక విభాగానికి చెందిన ఒక గుంపు మా యాత్రీకులతో పాటు ప్రయాణించింది. వారు ఆడపిల్లని రక్షించండి, ఆడపిల్లను చదివించండి అనే సందేశంతో 'తోలుబొమ్మలాట', నాటిక, నృత్యాలు ప్రదర్శించారు.

యాత్రలో చివరగా 'మోహన్‌పూర్' గ్రామం చేరుకున్నాక అక్కడ 'కరెం' తెగకి చెందిన వారితో జ్ఞానాన్ని పంచుకునే అవకాశం కలిగింది. అక్కడ వారు స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో వారు తమ సంస్కృతి, సృజనాత్మకత ప్రతిబింబించే కళాకృతులను ప్రదర్శించారు. చివరగా గవర్నర్ గారు, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ప్రధాన కార్యదర్శులతో పాటు సమాచార ప్రచార శాఖ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి ఈ శోధయాత్ర ఉద్దేశ్యము, పద్ధతులు వివరించటం జరిగింది.

ఈ శోధయాత్రలో బైట సంపాదించిన జ్ఞానాన్ని స్థానికులతో పంచుకునే అవకాశం కూడా చాలానే కలుగుతూ



వుంటాయి. యాత్రలో రైతులు, గృహస్తులు, మూలికా వైద్యులు, విద్యార్థులు, ఇన్నోవేటర్లు ..... ఇలా అనేక మందితో సమావేశాలు ఏర్పాటు చేసి, వారితో చర్చిస్తూ వుంటాము. ఇటువంటి సందర్భాలలో వారికి మేము పూర్వం సంపాదించుకున్న జ్ఞానాన్ని పంచే అవకాశం వస్తుంటుది. ఉదా.: ఒక గ్రామంలో వారి చెరువులో చేపలు చిన్నగా వున్నాయని ఒక వ్యక్తి వాపోయాడు. మాకు నాగాల్యాండ్‌లో జరిగిన శోధయాత్రలో ఎదురైన అనుభవం గుర్తుకు వచ్చింది. నాగాల్యాండ్‌లోని చెరువులలో వెదురు బద్దలు పాతుతూ వుంటారట. చేపలు ఆ వెదురు బద్దలకి రాసుకునేటపుడు చనిపోయిన చర్మం రాలిపోయి, చేపలు ఏపుగా పెద్దగా పెరుగుతాయట. అదే జ్ఞానాన్ని వీరితో పంచుకుని మీరూ ప్రయత్నించండి అని చెప్పాము. ఈవిధంగా ఒక ప్రాంతపు జ్ఞానాన్ని ఇంకొక ప్రాంతంలో పంచాలన్న ముఖ్య సూత్రాన్ని తు.చ. తప్పకుండా పాటించాము.

ప్రతి గ్రామంలో శుచి, శుభ్రతల స్థాయి చాలా బాగుంది. కాకపోతే ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించు కోవాలన్నది ఇంకా బాగా అమలు జరగటం లేదు. ప్రతి గ్రామంలో, ఆక్రమిత ప్రాంతాలలో కూడా ప్రభుత్వ పాఠశాల లు ఉన్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా, క్రమశిక్షణతో చదువు కుంటున్నారు. ఆక్రమిత ప్రాంతాలలోని ప్రజలు కరెంటు లేక పడుతున్న ఇబ్బందులకి పరిష్కారంగ సౌరశక్తి వాడే మార్గాలు అన్వేషించవలసి వుంటుంది. డిసెంబర్ 23 నుండి 26 వరకు గుజరాత్‌లో జరిగే సాంప్రదాయ వంటల ఉత్సవం 'సాత్విక్' లో పాల్గొనమని ఇక్కడి మహిళలను ఆహ్వానించాము.



రహదారులకి ఇరువైపునా దాదాపు వంద సంవత్సరాలకన్నా ఎక్కువ వయసున్న చెట్లు ఉన్నాయి. ఇక్కడివారు ప్రకృతి సందర్శన యాత్రలు, గృహ ఆతిథ్య పద్ధతులు లాంటి వాటితో పర్యాటకులని ఆకర్షించే ప్రయత్నాలు చేయాలి.

వక్కలను ప్రాసెసింగ్ చేసే యంత్రాలు చిన్న చిన్న వరి నూర్పిడి యంత్రాలు, కొబ్బరికాయలు కోసే యంత్రాలు, చిన్న టిల్లర్లు, వీడర్లు లాంటి చిన్న యంత్రాలు, పరికరాల అవసరం ఇక్కడ ఎంతైనా వుంది. పిల్లలలో సృజనాత్మకత మెచ్చుకోదగ్గ స్థాయిలో వుండి, భవిష్యత్తుపై ఆశలు పుట్టిస్తోంది. భూమిపైన, సముద్రపు ఒడ్డుల్లో జీవవైవిద్యాన్ని రక్షించటానికి ఇంకా ఖచ్చితమైన చర్యలు చేపట్టాల్సి వుంటుంది. ఈ దిశలో చంచల్ గారి లాంటి అధ్యాపకులు పిల్లలని భాగస్వాములుగా చేయటం సరియైన దిశలో సరియైన చర్యగా చెప్పుకోవచ్చు. ఈ వొక్క విషయం (పిల్లలను భాగస్వాముగా చేయటం) ఇతర ప్రాంతాలకి తెసుకు వెళ్ళ వలసిన ముఖ్యమైన పాఠంగా ఈ యాత్రలో మేము నేర్చుకున్నాం.


## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.


సోలార్ సెల్ ఛార్జర్


వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు


శ్రీతైలం

యూరియా


సోలార్ స్ప్రేయర్


కరెంటు స్తంభాలనెక్క చెప్పులు

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.
'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.



## జాతీయ అవార్డు పొందిన

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## పసుపు నూర్పిడి యంత్రం

### సమస్య – పరిష్కారం :

పసుపు లేదా ఏవైనా దుంపలు సాగు చేసేవారు పంట పక్వానికి వచ్చినప్పుడు సరియైన సమయంలో సరియైన పద్ధతిలో వాటిని త్రవ్వి తీయగలిగితే వృధాను అరికట్టవచ్చు. ఎక్కువ పనివాళ్ళపై ఆధారపడే ఈ ప్రక్రియలో డబ్బు పెట్టడానికి కొందరు రైతులు సిద్ధంగా వున్నా, మనుషులు లభించడం కష్టంగా మారుతోంది. రైతుకు దిగుబడి ఖర్చును పెంచటంలో ఇది ప్రధాన పాత్ర పోషించి, పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్య పరిష్కారానికి గాను తమిళనాడు రాష్ట్రానికి చెందిన రైతు పి. రామరాజు ఒక మినీ పవర్ టిల్లర్‌కు అనుసంధానంగా 'పసుపు దుంపలను భూమినుండి త్రవ్వి తీసే' పరికరాన్ని రూపొందించాడు. దీని సహాయంతో ఆలుగడ్డ, కంద, క్యారెట్ లాంటి దుంపలు, ప్రత్యేకించి పసుపు, అల్లం పంటల నూర్పిడి ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. అంతేకాదు దుంపల నాణ్యతకు ఎలాంటి భంగం కలుగకుండా తక్కువ ఖర్చులో రైతుకు లాభం చేకూర్చేలా పనిచేస్తుంది.



### పరికరం :

ఈ పరికరాన్ని ఒక బెల్ట్ ద్వారా పవర్ టిల్లర్‌కు అనుసంధానం చేయాల్సి వుంటుంది. టిల్లర్ నడిచేటపుడు ఈ పరికరం భూమిలోకి చొచ్చుకొనిపోయి, దుంపలను పైకి తీసి మట్టిన జల్లించి, దుంపలకు ఎలాంటి దెబ్బ తగలకుండా కత్తిరించి వేరు చేస్తుంది. వాటిని సేకరించడం కూడా ఎంతో సులువు. తక్కువ కూలీలతో ఎక్కువ దుంపలను సేకరించుకోవచ్చు. ప్రస్తుతం ఈ పరికరం ఎంతోమంది రైతుల మన్ననలు పొందటంతో పాటు, ఎంతో మంది కూలీల ఖర్చును కూడా ఆదా చేస్తోంది.

### సాంకేతిక వివరాలు :

- దీన్ని 10–12 హార్స్‌పవర్ శక్తిగల టిల్లర్‌కు అనుసంధానం చేయాల్సి వుంటుంది.
- భూమిలోపలికి చొచ్చుకుపోవటానికి 3 బ్లేడ్లు కలిగి వుంటుంది. బ్లేడ్లు ఎంత లోతువరకు వెళ్ళాలో నియంత్రించుకునే సదుపాయం కలదు.
- భూమిలోపలికి వెళ్ళే 3 బ్లేడ్లు 10 అంగుళాల వెడల్పులో వుంటాయి.
- భూమి రకాన్ని అనుసరించి అవసరమైనంత లోతులో త్రవ్వి, జల్లిపట్టే సామర్థ్యాన్ని కూడా నియంత్రించు కోవచ్చు.
- ఒక గంటలో దాదాపు పావు ఎకరంలో దుంపలను త్రవ్వి తీయవచ్చు.





❀ టిల్లర్‌కు ఉపయోగించే ఇంధనం తప్ప ఈ పరికరాన్ని ఎటువంటి ఇంధనం అవసరం లేదు.

**ముఖ్యాంశాలు :**

❀ సులభంగా ఎక్కువ నూర్పిడి చేసుకోచ్చు.

❀ టిల్లర్‌ను నడిపే ఒక్క వ్యక్తి మాత్రమే అవసరం. నూర్పిడి అయిన దుంపలను సేకరించడానికి కూలీలు అవసరం.

**పురస్కారాలు :**

❀ ఎన్.ఐ.ఎఫ్. వారు 2013లో నిర్వహించిన 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో ఇన్నోవేటర్ రామరాజుకు ప్రోత్సాహక బహుమతి లభించింది.

ఇన్నోవేటర్ : **పి. రామరాజు, తమిళనాడు.**

# మల్టి పర్పస్ ఫుడ్ ప్రాసెసింగ్ మిషన్




**సమస్య – పరిష్కారం :**

ఔషధాలకి వాడే తినగలిగిన, తినలేని పళ్ళ నుండి రసము, గుజ్జు, నూనెలు, సారము తీయటానికి కలపటము, దంచటము, ఉడకబెట్టటము, పిండటము లాంటి అనేక ప్రక్రియలు చేయాల్సి వుంటుంది. ఔషధ మరియు ఆహార పదార్థాల తయారు చేసే సంస్థలు తమ ఉత్పత్తులను తయారు చేయటానికి దంచటానికి, కలపటానికి, ఉడకబెట్ట డానికి, ఆవిరి పెట్టి రసాలు, నూనె, గుజ్జు చేయటానికి వేర్వేరు యంత్రాలను ఏర్పాటు చేసుకుంటారు. ఇవన్నీ చేసే ఒక యంత్రం ఎక్కడా లేదు. హర్యానాకు చెందిన 'ధర్మవీర్ కాంభోజ్ అటువంటి అన్ని పనులు చేసే ఒకే యంత్రాన్ని రూపొందించాడు.

ఉదా.: 1. ఈ యంత్రంలో టమోటాలను ఉపయోగించి, టమోట ఎసెన్స్, టమోట సాస్, టమోట గుజ్జు, టమోట సూప్ పొడి లను వేర్వేరుగా చేసుకుని ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు.

2. అదేవిధంగా ఉసిరి కాయలను ఉపయోగించి ఉసిరి ఒరుగులు, ఉసిరి జామ్, ఉసిరి నూనె, ఉసిరి ఎస్సెన్స్, ఉసిరి లడ్డులను తయారు చేసుకోవచ్చు.

**పరికరం :**

తేలికగా ఎక్కడికైనా తీసుకు వెళ్ళడానికి వీలైన ఈ



యంత్రం సహాయంతో అనేక రకాల పళ్ళు, కూరగాయలు, ఔషధ మొక్కలు, విత్తనాల నుండి అనేక ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు. దీనినే ప్రెషర్ కుక్కర్‌గా కూడా ఉపయోగించవచ్చు. దానికై వేడిని నియంత్రించి, తగిన వేడి కాగానే దానంతట అదే ఆగిపోయేలా చేసే సదుపాయం కూడా ఉంది. ఔషధ మొక్కల పూలు, ఆకులను ఇందులో వేసి వాటినుండి అవసరమైన వివిధ రకాల ఉత్పత్తులను సులభంగా తయారు చేసుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

- సింగిల్ ఫేస్ కరెంటుతో పని చేస్తుంది.
- గంటకు ఒకటిన్నర యూనిట్ల కరెంటు ఖర్చవుతుంది.
- ఈ యంత్రం 125 కిలోల బరువుంటుంది.
- దీనికి చక్రాలు ఏర్పాటు చేయటం వల్ల ఎక్కడికైనా సులభంగా లాక్కెళ్ళవచ్చు.
- దీని మోటరు 1440 ఆర్‌పియంతో పని చేస్తుంది.
- రోటరు వేగం 360 ఆర్‌పియం.
- మొదటి రకం మాడల్‌లో గంటకి 50 కిలోల రసం, రెండో రకం మాడల్‌లో గంటకి 150 కిలోల రసం తీయవచ్చు.
- రెండు హీటర్లు కలిగి, దానంతట అదే వేడిని నియంత్రిస్తూ తగినవేడికి చేరగానే ఆఫ్ అవుతుంది.

**ముఖ్యాంశాలు :**

- వేడిని నియంత్రిస్తూ ఉడకబెట్టే పద్ధతి.
- పళ్ళు, పూలు, కూరగాయలు, ఔషధ దినుసులు - మొక్కలు, ఆకులు లాంటి అనేక రకాల పదార్థాలను విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసుకోవచ్చు.
- అలోవీరను ఉపయోగించి హెర్బల్ జ్యూస్, హెయిర్ జెల్, ఫేస్ వాష్, షాంపూ, హ్యాండ్ వాష్, ఎక్స్ట్రాక్ట్‌లను తయారు చేసుకోవచ్చు.
- మామిడి పళ్ళను ఉపయోగించి, జ్యూస్, చట్నీ, జామ్ మొదలైనవి తయారు చేసుకోవచ్చు.
- ఉసిరిని ఉపయోగించి పౌడర్, ఎక్స్‌ట్రాక్ట్ (పిప్పి), జ్యూస్, హెయిర్ ఆయిల్, జామ్, తీపి పదార్థాలు, లడ్డూలు చేసుకోవచ్చు.
- తులసి, అశ్వగంధ, శతావరి ఇతర మూలికలను ఉపయోగించి రసాలు, ఎక్స్‌ట్రాక్ట్ చేసుకోచవచ్చు.
- గులాబి, మల్లె, ల్యావెండర్ లాంటి పూలను ఉపయోగించి సెంటు, ఎక్స్‌ట్రాక్ట్ చేసుకోవచ్చు.
- వ్యక్తులు, మహిళా సమూహాలు, యువత ఉపాధి కల్పనకి ఎంతో ఉపయుక్తమైనది.
- ఆటోమేటిగ్గా పని చేస్తుంది కనుక ఆరోగ్యదాయక మైనది.
- దీన్ని ఉపయోగించి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయటం వల్ల వృధా అనేదే లేకుండా ఆర్థికంగా లాభకరంగా ఉంటుంది.

**పురస్కారాలు :**

- 2009లో భారత రాష్ట్రపతి 5వ జాతీయ స్థాయి పోటీలలో ధరమ్‌వీర్‌ను సత్కరించడం జరిగింది.

**వివరాలకు సంప్రదించండి:**

**ధరమ్‌వీర్ కాంభోజ్**, హర్యానా.
**ఫోన్ : 9896054925**



ప్రదర్శనలు

# నవంబర్ డిశంబర్ మాసాల్లో పల్లెసృజన పాల్గొన్న వివిధ ప్రదర్శనలు - కార్యక్రమాలు

విజయవాడలో నవంబర్ నెలలో జరిగిన 'అలీప్ మహిళా ఎంటర్‌ప్రైజెస్ ప్రదర్శన 'లో పల్లెసృజన పాల్గొన్న దృశ్యాలు









డిశంబర్ 11వతేది 22 మంది మహిళా సైంటిస్టులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించి పునాది స్థాయి ఇన్నోవేషన్ల అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్నారు.





నవంబర్ 17వ తేది పూనేలో జరిగిన 'నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సోషియల్ ఇన్నోవేషన్' కార్యక్రమంలో కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు తయారు చేసిన ఇన్నోవేటర్ నన్నం తిరుపతికి సత్కారం.






డిశంబర్ 3,4 మరరియు 5వ తేదదీలలలో 6 నుండి 8వ తరగతతి చదువుతున్న దాదాపు 150 మంది విద్యార్థులు 'పల్లెసృజన' విస్తృత కేంద్రాన్ని సందర్శించి, పునాది స్థాయి ఇన్నోవేషన్లను ఆసక్తిగా తిలకించారు.





'పల్లెసృజన' ఇన్నోవేటర్ గోదాసు నర్సింహ తయారు చేసే యంత్రాన్ని భారత ప్రభుత్వం కేన్యా ప్రభుత్వానికి బహుమతిగా అందించనుంది. దాని పనితీరును పరిశీలించేందుకు డిశంబర్ 23న కేన్యాలోని ఒక రాష్ట్ర డిప్యూటీ గవర్నర్, మినిష్టర్, ఆ దేశ రాయబారి మరియు ఇతర అధికారులు గోదాసు నర్సింహ స్వగ్రామమైన ముక్తాపూర్‌కు విచ్చేసిన దృశ్యాలు






# నీతులు మాటల్లో కాదు ఆచరణలో చూపుతున్న 'లింగాల కేదారి'




- పల్లె వీరరాఘవ రెడ్డి

**వరంగల్ పట్టణం..... హన్మకొండ ప్రాంతం ..... ఎప్పుడూ జన సంచారంతో కిక్కిరిసి ఉండే "అదాలత్ చౌరస్తా".... పక్కనే చిన్న హోటల్....దాని యజమానే 'లింగాల కేదారి'. అందరిలాగానే హోటల్ నడుపుకుంటూ నాలుగు రాళ్ళు వెనకేసుకోకుండా, తన తండ్రి చెప్పిన మాట 'డబ్బు కాదు ముఖ్యం, మంచి పేరు సంపాదించుకోరా' అన్న మాటలు పాటిస్తూ తనది మామూలు హోటల్గా కాదు "అన్నం పడేస్తే ఫైన్ వేస్తా" అని బెదిరించే హోటల్గా మార్చాడు. ఇదేం కొత్తగా ఉంది అనుకుంటున్నారా? కొత్తగా ఉండేదే ఇన్నోవేషన్.**

ఇన్నోవేషన్ అనేది వస్తు రూపంలోనే కాదు, ఆలోచనా రూపంలో కూడా వుంటుందని నిరూపించాడు వరంగల్ జిల్లాకు చెందిన 'లింగాల కేదారి'. తన సృజనాత్మకమైన ఆలోచనతో సమాజానికి మూడు విధాలుగా లాభాన్ని చేకూర్చాడు. ఇతని సృజనాత్మక ఆలోచనను గురించి తెలుసుకుందాం.....

వరంగల్ జిల్లాకు చెందిన 50 సంవత్సరాల లింగాల కేదారి మొదట కుండల వ్యాపారం చేసుకుంటూ వుండేవాడు. వర్షాకాలం వ్యాపారం సరిగ్గా జరగక, ఒకరోజు జేబులో డబ్బు లేదు, తినటానికి తిండి లేక ఆకలితో అలాగే బాధ పడుతూ పడుకున్నాడు. ఆకలి ఎక్కువగా వుండటంతో తెల్లవార్లూ నిద్ర పట్టలేదు. ఏదైనా తినాలన్నా తన కుండల వ్యాపారం వద్దనుండి హన్మకొండ చౌరస్తా వరకు దాదాపు 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్ళాలి. కనీసం చాయ్ అయినా తాగుదామని తెల్లవారుఝామున 5 గంటలకు లేచి బయలుదేరాడు. అలా వెళ్తూ వుంటే అక్కడ 'భారత్ మెస్' అనే హోటల్ వాళ్ళు గత రాత్రి మిగిలిపోయిన సాంబారు, అన్నములను మురికి కాల్వలో పారవేయటం గమనించాడు. అవి ఏమీ చెడిపోలేదు, అయినా మిగిలిపోయాయి కాబట్టి పారవేస్తున్నారు. వాటిని తినేందుకు కుక్కలు ఎగబడుతున్నాయి.

తానేమో రాత్రంతా అన్నం లేక అల్లాడిపోయాను, వీళ్ళేమో ఎక్కువై పారవేస్తున్నారు, ఇలా చేసేకంటే ఎవరికైనా దానంగా ఇచ్చివుంటే ఎంతోమంది ఆకలి తీరి వుండేది కదా! అని అనుకున్నాడు. ఇలా మురికి కాల్వలో పారవేసే బదులు, రోడ్డు ప్రక్కన ఒక పిట్టగోడపైన పెడితే ఎవరైనా తింటారు కదా అనుకున్నాడు. ఇలా చాలాసార్లు గమనించాడు. దీనికి పరిష్కారం కనుగొనాలి అనుకున్నాడు కేదారి. 2000 సంవత్సరంలో హన్మకొండ అదాలత్ చౌరస్తాలోని అదే 'భారత్ మెస్'ను కొన్నాడు. తాను ఇతరులకు నీతి సూత్రాలు చెప్పటం కాదు, ముందు తాను ఆచరించి చూపితే మిగతా సమాజం అదే నేర్చుకుంటుంది అనుకున్నాడు. తాను 'ఆహార




పదార్థాలను వృథాగా పారవేయకండి' అన్నది సమాజానికి ఆచరణపూర్వకంగా నేర్పాలనుకున్నాడు. 'నీతి అనుకున్నది ముందు నువ్వు ఆచరించు, తర్వాత ప్రక్కవాడికి చెప్పు. ఆ తర్వాత సమాజం తనంతట తానే నేర్చుకుంటుంది' అన్న మహాత్మాగాంధీ సూక్తిని ఆచరించాలి అనుకుని రెండు సంవత్సరాల క్రితం తన హోటల్‌లో ఒక విచిత్రమైన బోర్డును తగిలించాడు. "తినే ఆహారం వృథా చేస్తే ఫైన్ కట్టాలి" అని.

తన హోటల్‌లో దాదాపు పది రకాల కూరగాయలు, మూడు రకాల చికెన్, చేప, సాంబారు పెరుగు, మూడు రకాల చట్నీలు లాంటి అన్ని రకాల పదార్థాలతో భోజనానికి అతను తీసుకుంటున్నది మాత్రం కేవలం రూ. 50 లే. ఇలాంటి భోజనం బైట హోటల్లో రూ. 120 నుండి రూ. 200 దాకా వుంటుంది. ఇంకాస్త పెద్ద హోటలైతే ఇంకా ఎక్కువగానే వుండొచ్చు. కేదారి తన హోటల్‌లో వినియోగదారుని వద్ద 60 రూపాయలు తీసుకుని టోకెన్ ఇస్తాడు. తను తినాల్సినంత ఆహారం తృప్తిగా తిని, ఏ ఒక్క ఆహార పదార్థమూ వృథా చేయకుండా తిని ఖాళీ ప్లేటు పారవేసేటప్పుడు చూపిస్తే రూ. 10 తిరిగి ఇచ్చేస్తాడు. వృథా చేసినవారికి రూ. 50లు జరిమానాగా తీసుకున్నది, వద్దు వుంచుకోండి అన్నవారి డబ్బును అక్కడే ఏర్పాటు చేసివున్న అనాథ ఆశ్రమాల హుండీలో వేసేస్తాడు.

నీవు ఎంత ఆహారం తినగలవో నీకు తెలుసుగా, మరి అదనంగా ఎందుకు వేసుకున్నావు, వాటిని వదలి వెళ్తున్నావు. నీకు ఎక్కువైంది కాబట్టి జరిమానా కట్టాల్సిందే, నీవు మళ్ళీ ఈ హోటల్ వస్తే రా, లేకపోయినా ఫర్వాలేదు. జరిమానా కట్టి తీరాల్సిందే అనే షరతు విధించాడు. నీవు ఆహార పదార్థాలు వృథా చేయటం వల్ల జరిగే నష్టం ఎంతో తెలుసా? దీన్ని చెత్తకుండీలో వేస్తే అక్కడ దోమలు పుట్టుకొస్తాయి, పురపాలక శాఖ వారికి పని, రోడ్డు ప్రక్కన నడుచుకుంటూ వెళ్ళే వారికి దుర్వాసన. అసలు నువ్వు వృథాగా పడేసే ఆహారం పండించటానికి ఆ రైతు పడ్డ శ్రమ (ఒక కిలో బియ్యం పండించటానికి 200 లీటర్ల నీరు ఖర్చవుతుంది తెలుసా?) అది కొనటానికైన ఖర్చు, వండటానికైన ఖర్చు ఇలా ఎన్ని వేల మంది లక్షల మంది, ఎన్నికోట్ల ముద్దలు, కిలోల ఆహార పదార్థాలు పడేస్తున్నారో తెలుసా? ఇలా చేస్తే దేశానికి ఎంత నష్టమో తెలుసా? ఇలా ఉంటాయి అతని ప్రశ్నలు. ఇంతమందికి నష్టాన్ని కలిగించేలా అన్నాన్ని ఎంతో సునాయాసంగా ఎక్కువైందని కుప్పతొట్టిలో పడేస్తున్నావే! ఏమైంది నీ విచక్షణ? నీ తెలివిలేని తనానికి జరిమానా కట్టాల్సిందే. అని ఇంతమందికి నష్టం వాటిల్లజేసే ఈ వృథాను ఇక్కడే అరికట్టాలి అనుకున్నాడు కేదారి.

నాకు లాభం వద్దు, రుచిగల భోజనం పెడ్తాను నీవు ఎంత తినగలవో అంతే తిను అంతేగాని వృథామాత్రం చేయకు అదనంగా వచ్చే 70 రూపాయల లాభం నాకవసరం లేదు అంటాడు. ఆహారం వృథా చేయకండి అని అందరూ బోర్డులు పెడ్తారు కానీ, ఇంత కఠినంగా ఆచరించేలా వ్యవహరిస్తూ తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నవాడు కేదారి మాత్రమే అని చెప్పవచ్చు. వ్యాపారం బాగా జరుగుతోంది. తన హోటల్‌కు ఎంతోమంది సామాన్యులు, ప్రక్కనే కోర్టు వుండటంతో జడ్జీలు,






పోలీసు వారు, మున్సిపాలిటీ అధికారులు కూడా వచ్చి తింటున్నారు. ఒకసారి ఇతని హెూటల్ ప్రత్యేకతను విన్న జడ్జి అక్కడి నుండి భోజనం పార్శల్ తీసుకు రమ్మనగా, ఈ సమయం (మధ్యాహ్న భోజన సమయంలో) లో పార్శల్ ఇవ్వటం మా నియమ విరుద్ధం కనుక దయచేసి ఇక్కడికే స్వయంగా వచ్చి భోజనం చేయమని కబురు చేయగా, ఆయనే వచ్చి భోజనం చేసి, యధాలాపంగా కొంత ఆహారాన్ని వృధాగా పడవేశాడు. అది చూసిన కేదిరి మీరు ఆహారాన్ని వృధా చేశారు కాబట్టి 50 రూపాయలు జరిమానా చెల్లించాల్సిందే అన్నాడు. దానికా జడ్జి 'నేనే అందరికీ జరిమానాలు విధించే వాడిని, అలాంటిది నాచేతనే జరిమానా కట్టిస్తున్నావు. నీ ఆలోచన, పద్ధతికి నేను ముగ్ధుడనయ్యాను' అని జరిమానా కట్టి మరీ వెళ్ళాడట!

అంతే కాదు అవసరమైతే పిల్లలకి, యాత్రీకులకి, ఇంకా తక్కువ ధరకే భోజనం పెడ్తానని, డబ్బు లేదన్న వారికి ఉచితంగా భోజనం పెడ్తాను. తాను వండిన పదార్థాలు అయిపోతే, తక్కువ ధరకే అన్నం పెడ్తాను కానీ, తన హెూటల్‌లో జబర్దస్తీ చేసే వారికి, తాగుబోతులకు ప్రవేశం లేదు అంటాడు.

హెూటళ్ళలో టిఫిన్‌లను గురించి ప్రస్తావిస్తూ మీకు తెలుసా ఇడ్లీ ఖరీదు తక్కువ అయి వుండొచ్చు కానీ, దానికన్నా దాంతో తినే సాంబారు చట్నీ ఖరీదు ఎక్కువ. ఇది గమనించిన తాను ఒక రూపాయికే ఇడ్లీ అమ్మి, సాంబారు, చట్నీలకి అదనంగా డబ్బు తీసుకునే పద్ధతి ప్రారంభించానని, ఆ సమయంలో చాలామంది వచ్చి తినేవారని, కానీ స్థానికంగా ఇతర హెూటల్ వ్యాపారస్తులు ఇది కూడదని, బ్రతిమాలి, బెదిరించటంతో అందరికీ చెడ్డవాడు అవటం ఇష్టం లేక ఆ పద్ధతి మానేశాను అన్నాడు.

డబ్బు, బంగారం దాచుకోవచ్చు కానీ అన్నం దాచుకోలేవు నీకు ఎంత అవసరమో అంతే తింటావు తప్ప దాన్ని దాచుకోలేవు. వృధా మాత్రం చేయవద్దు అన్నదే అతని వాదన. తాను ఈ షరతు పెట్టడం వల్ల కొత్తలో కొందరు అహంభావులు గొడవ చేశారు కానీ, ఇప్పుడు అందరూ నా ఆదర్శాన్ని మనస్ఫూర్తిగా ఒప్పుకుని తన హెూటల్‌లో ప్రతిరోజూ దాదాపు 300 మందికి పైగా భోజనం చేస్తున్నారు. ఇంతమంది భోజనం చేసిన తర్వాత ఒక్క మెతుకు కూడా వదలకుండా తిన్న కంచాలను, ఆకులను పారవేయటాన్ని 'పల్లెసృజన' బృందం చూసి ఎంతో ఆశ్చర్యపోయింది. మీకేమైనా కూర బాగాలేదా చెప్పండి నేను ఫైన్ ఇస్తాను అంతే తప్ప రుచిగా వున్న భోజనాన్ని మాత్రం వృధా చేయవద్దు అంటాడు కేదారి. తన హెూటల్‌లో రాత్రికి మిగిలిపోయిన అన్నాన్ని అనాధ ఆశ్రమాలకు, బీదలకు దానంగా ఇస్తాడే తప్ప వృధాగా మాత్రం పారబోయడు. మంచి రుచిగల భోజనం మాత్రమే వడ్డిస్తాడు. భోజనాలు ప్రారంభం కాకముందు పార్శల్‌లు కూడా పంపుతాడు కానీ, పార్శల్‌లో రెండు రకాల కూరలు, సాంబార్, పెరుగు మాత్రమే పంపుతాడు. ఎందుకంటే వారి ఆహారం వృధా కాకుండా నియంత్రించటం కష్టం కాబట్టి. పార్శల్ అయితే ఇంతే వుంటుంది. ఇక్కడ వచ్చి తినండి, కావాల్సినన్ని కూరలు వుంటాయి అంటాడు.

ఈ హెూటల్‌లో మధ్యాహ్నం మాత్రమే భోజనం



అందిస్తారు. సాయంత్రం హెూటల్ బయట అల్పాహారం విక్రయిస్తారు. అలాగే ప్రతిరోజో దాదాపు 1000 మంది దాకా వివిధ శుభకార్యాలకు, క్యాటరింగ్ ద్వారా భోజనం సరఫరా చేస్తూ వుంటాడు. క్యాటరింగ్‌లో కూడా తన మనుషుల ద్వారా ఈ భోజనం వృధా కాకుండా చేసే ప్రయత్నాలను మాత్రం చేస్తూనే వుంటాడు. క్యాటరింగ్‌లో ఎవరైనా పదార్థాలను వృధాగా పారవేస్తుంటే ఏమైంది పదార్థాలు బాగాలేవా? అని అడుగుతాడు, బాగున్నాయి కానీ, ఎక్కువైంది అందుకే పారవేస్తున్నామంటే, అంత ఎక్కువ అయ్యేటట్లుగా ఎందుకు వడ్డించుకున్నారు, ఇలా వృధా చేయటం మంచిది కాదు కదా అని సుతారంగా హెచ్చరిస్తూ వుంటారు వీరి మనుషులు.

తాను తయారు చేసే భోజనంలో ఏ పదార్థమూ పడవేసే అవకాశం లేకుండా టమాటా, ఆలు లాంటి వాటిని మిక్సీ చేసి వాడతానని, చివరికి పోపులో ఎండు మిరప కాయలు కూడా వేయనని, ఈవిధంగా వంటలో శ్రద్ధ తీసుకుంటామని, మాంహాహారరులు ఎముకలను మాత్రం పారవేస్తారు అంటాడాయన.

తాను మొదలు పెట్టిన ఈ ఉద్యమం ఇప్పుడు ఎంతోమంది తమ ఇళ్ళల్లో ఆచరిస్తున్నారు అదే తనకు ఆనందం అంటాడితను. ఇతని ఆదర్శాన్ని గుర్తించిన ఎందరో మేధావులు ఇతనికి సన్మానాలు కూడా చేశారు. దేశ విదేశాల నుండి కూడా ఎంతోమంది ఇతని ఆదర్శాన్ని వేనోళ్ళ పొగడుతున్నారు. స్థానిక పత్రికలు, టీవీ ఛానళ్ళు ఇతని ఈ ప్రయోగం గురించి అనేక కథనాలు ప్రచురించి, ప్రసారం చేశాయి.

ఎంత సంపాదించినా నీవు కాలధర్మం చేసినపుడు వాటిని పట్టుకుపోలేవు, కానీ మంచిపేరు సంపాదిస్తే మాత్రం అది నీతోనే వుంటుంది అన్న తన తండ్రి మాటలే తనకు ఆదర్శం అంటారు కేదారి. నువ్వు ఏ ఊరికి వెళ్ళినా నీకు నీళ్ళు


లింగాల కేదారి కుటుంబం


వినియోగదారులు శుభ్రంగా తిని పారవేసిన ప్లేట్‌లు

ఇచ్చేవాడు, అన్నం పెట్టేవాడు, పడుకునేందుకు స్థలం ఇచ్చేవాళ్ళను సంపాదించుకో అన్న తన తండ్రి మాటలను తానెప్పుడూ మరవను అంటాడితను. తన తండ్రి తనకు చెప్పిన సిద్ధాంతాలనే తాను పాటిస్తున్నానని, అదే తనకు ఇంతటి గౌరవాన్ని, ఆదాయాన్ని సమకూరుస్తోంది అని ఆనందంగా చెప్పుకుంటాడు.

నిజాయితీగా నేను ప్రజలకు సేవ చేస్తున్నాను. వ్యాపారాత్మకంగా కేటరింగులు చేస్తున్నాను, సంపాదిస్తున్నాను. ఇప్పుడు నాకో కారు వుంది, మంచి ఆస్తులు సంపాదించుకున్నా ఇంతకంటే నాకు అవసరం లేదు, తన హెూటల్ ద్వారా లాభాపేక్ష లేకుండా పదిమందికి మంచి అన్నం పెడుతున్నా, మంచి అలవాటుని ప్రజల్లోకి తీసుకు వెళ్ళగలిగాను, ఇంతకన్నా తనకు ఇంకేమి కావాలి? ఈ తృప్తి నాకు చాలు అంటాడు. నిజాయితీగా వ్యాపారం చేస్తే భగవంతుడే మనకు అన్ని సమకూరుస్తాడు అని తన కుటుంబీకులు కూడా తనకు ఎంతో తోడును అందిస్తారని ఆనందంగా చెప్తాడు కేదారి. కేదారి భార్య పుష్పలత, పెద్ద కుమారుడు లింగాల కేదారి పృథ్వీరాజ్, యం.బి.ఏ. రెండవ సంవత్సరం చదువుతున్నాడు, రెండవ అబ్బాయి లింగాల కేదారి ఆకాశ్ రాజ్, ఎలక్ట్రానిక్స్‌లో ఐటిఐ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు అందరూ ఇతని వ్యాపకంలో పాలు పంచుకుంటూ వుంటారు. ఇతను ప్రత్యక్షంగా పది మందికి, పరోక్షంగా 30 మంది వరకు జీవనోపాధి కల్పిస్తుంటాడు. ఈ తృప్తి చాలు నాకు అంటాడు లింగాల కేదారి.

లింగాల కేదారి ఆచరిస్తున్న ఈ సృజనాత్మక ఆలోచన అందరూ పాటించి ఆహారాన్ని వృధా చేయకుండా, తమకు ఎక్కువైన దాన్ని ఇతరులకు అందించండి తప్ప వృధాగా పారవేయవద్దు అని కోరుకుంటోంది 'పల్లెసృజన'.

**లింగాల కేదారి ఫోన్ నెం. 9394513399, 9849314830**

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అన్ని వాతావరణాలు, ప్రాంతాలకు అనువైన 'ఆపిల్' రకం

**జాతీయ రెండవ బహుమతి – మొక్కల రకం**

**హెచ్ఆర్ఎంఎన్–99 యాపిల్ రకం**

**ఇన్నోవేటర్ : హరిమాన్ శర్మ, బిలాస్‌పూర్, హిమాచాల్ ప్రదేశ్.**



హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ ప్రాంత వాస్తవ్యుడైన 60 సంవత్సరాల హరిమాన్ శర్మ ఒక అభ్యుదయ రైతు. సాధారణంగా యాపిల్ చెట్లు పుష్పించి ఫలించాలంటే చాలా చల్లని ప్రదేశం అయివుండి, కొండవాలు అవసరమై వుంటుంది. కానీ ఇతను 40 నుండి 45 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడి వున్న ప్రాంతాలలో కూడా పండించటానికి అనువైన యాపిల్ రకాన్ని రూపొందించాడు.

మూడు సంవత్సరాల వయస్సులోనే తల్లిని పోగొట్టుకున్న హరిమన్‌ను మేనమామ చేరదీశాడు. పదవ తరగతి వరకు చదివిన తర్వాత వ్యవసాయంలోకి దిగిపోయాడు. ప్రస్తుతం ఇతను భార్య, పిల్లలు, మనవలతో జీవిస్తున్నాడు. ఇద్దరు కూతుర్లకి పెళ్ళిళ్ళు అయిపోయాయి. కొడుకులిద్దరు కూడా స్థిరపడ్డారు. పెద్ద కొడుకు తండ్రితోనే వుండి వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తూ వుంటాడు. హరిమన్ తనకున్న 1.75 హెక్టార్ల భూమిలో వ్యవసాయం చేస్తూ వుంటాడు. అదే అతని ప్రధాన జీవనాధారం. వ్యవసాయంతో పాటు ఈయనకి రకరకాల పండ్ల మొక్కలు పెంచటం అలవాటు. ఈయన ఆపిల్, మామిడి, దానిమ్మ, కివి, ప్లం, ఆప్రికాట్, పీచ్ మొదలైన పళ్ళతో పాటు కాఫీ మొక్కలను కూడా పెంచుతుంటాడు. విచిత్రమేమిటంటే మామిడి చెట్టు ప్రక్కనే ఆపిల్ చెట్లు కూడా ఉంటాయి ఇతని తోటలో! "రైతులు ఆదాయం పెంచుకోవాలి అంటే సమతల భూములలో కూడా ఆపిల్ తోటలను పెంచుకోవటమే సరియైన మార్గం" అంటాడు ఇతను. తాను పెంచిన ఆపిల్ మొక్కలు పళ్ళు కాస్తున్నాయని ఎవరైనా చెబితే తెగ ఆనందపడి పోతుంటాడు.

**పుట్టుక :**

ఈ ఆపిల్ రకం తాను కనిపెట్టిన వైనం చెపుతూ 1998లో తాను స్థానిక బిలాస్‌పూర్ నుండి కొన్ని ఆపిల్

పండ్లను కొని తిని, గింజలను ఇంటి ఆవరణలో పడేశాడు. ఒక సంవత్సరం తర్వాత చూస్తే ఆ గింజలు మొలకెత్తాయట. ఆశ్చర్యపోయి వాటిని అలాగే సంరక్షించాడు. మూడు సంవత్సరాల తర్వాత 2001లో ఆ చెట్టుకు కాయలు కాశాయి. రైతుగా ఉష్ణప్రాంతంలో సముద్ర మట్టానికి కేవలం 1800 అడుగుల ఎత్తున వున్న ప్రదేశంలో ఆపిల్ చెట్టు బ్రతకటం, కాయలు కాయటం విచిత్రమని కనిపెట్టాడు. అప్పటినుంచి ఆ చెట్టుని చాలా జాగ్రత్తగా కాపాడి, మరుసటి సంవత్సరం కొన్ని కొమ్మలు తీసి, అంటు కట్టే ప్రయత్నంలో వేరే ఆపిల్ చెట్టు లేక 'ప్లం' చెట్టు కొమ్మలకి అంటు కట్టాడు. ఈవిధంగా అంటు కట్టిన చెట్ల ఫలాలు మంచి రకానికి చెందినవై వుండి తియ్యగా ఉన్నాయి. 2003, 2005 సంవత్సరాల మధ్య ఇతను సిమ్లా నుండి కొన్ని ఆపిల్ మొక్కలను తెప్పించి, తన ఆపిల్ రకంతో మళ్ళీ అంటు కట్టి క్రమంగా చిన్న ఆపిల్ తోటను తయారు చేసుకున్నాడు. అప్పటినుండి ఉష్ణ ప్రాంతంలో కూడా ఆపిల్ పంట పండించే ప్రక్రియకు నాంది పలికాడు. ఇప్పటికీ ఇతను కాశ్మీర్ నుండి ఆపిల్ మొక్కలను తెచ్చి తన మొక్కలతో కలిపి అంటు పెడుతూనే వుంటాడు.

**ఈ ఆపిల్ ప్రత్యేకతలు :**

సాధారణంగా ఆపిల్ చెట్లు సముద్ర మట్టానికి 5000 నుండి 8,500 అడుగుల ఎత్తయిన కొండవాలు ప్రాంతాల్లో సంవత్సరంలో 40 నుండి 60 రోజుల చల్లని వాతావరణం వున్న ప్రదేశాలలో మాత్రమే పండుతాయి. కాని హరిమన్ రూపొందించిన ఆపిల్ చెట్లు కేవలం సముద్ర మట్టానికి 1800 ఎత్తు ప్రాంతాల్లో, వాతావరయం 40 డిగ్రీల పైబడి వున్నా కూడా పండించుకోవచ్చు.





చీడపీడలను, ప్రత్యేకించి మచ్చ తెగుళ్ళను తట్టుకునే శక్తి గల ఈ రకం ఉష్ణ ప్రదేశాలలో కూడా సులభంగా పండించుకోవచ్చు. ఈ చెట్టు కూడా కేవలం 12 నుండి 15 అడుగుల ఎత్తుకు మించకుండా మూడవ సంవత్సరం నుండి కాపుకు వస్తుంది. జనవరి ప్రాంతంలో పూతకు వచ్చి, ఆరు నెలల్లో అంటే జూన్ ప్రాంతంలో కాపుకు వస్తుంది. నవంబర్ డిసెంబర్ మాసాల్లో చెట్టును ప్రూనింగ్ చేసుకోవాల్సి వుంటుంది. పండు పరిమాణం మధ్యరకంగా వుండి, లేత పసుపు, ఎరుపు రంగుల్లో వుండి తియ్యగా వుంటుంది. 10 నుండి 12 సంవత్సరాల వయసు వున్న చెట్టు ఒక క్వింటాలు పళ్ళ దిగుబడినిస్తుంది. శీతలీకరణ లేకుండా గది వాతావరణంలో కేవలం 10నుండి 12 రోజులు మాత్రమే నిలువ వుంటుంది. దీనిని అభివృద్ధి చేసే ప్రయత్నంలోనే తాను ఉన్నానని చెపుతున్నాడు హరిమాన్.

దేశవ్యాప్తంగా కొన్ని వేల చెట్లను కొన్ని వందల మంది రైతులకు సరఫరా చేయగా చాలా ప్రోత్సాహకరమైన ఫలితాలు వచ్చాయట. ఎన్ఐఎఫ్ కూడా ఈ చెట్ల వితరణలో ముఖ్య పాత్ర నిర్వహించింది. 2014-15 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 7,572 మొక్కలను ఎన్ఐఎఫ్ రెండు సంవత్సరాల సమయం నిలదొక్కుకోవటానికి, మూడు సంవత్సరాల సమయం ఫలితాల సేకరణకి అని నిర్ణయించుకొని ప్రయోగం చేసింది. కానీ ఆశ్చర్యజనకంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్నాటక, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల నుండి మొదటి సంవత్సరం కాగానే కాయలు కాసినట్లు ఫలితాలు వచ్చాయి.

భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ వారు ఈ హెచ్ఆర్ఎంఎన్-99 ఆపిల్ రకం మిగిలిన రకాలకన్నా

శ్రేష్ఠమైనదిగా నిర్ధారించింది. గుజరాత్ రాష్ట్ర బయోలాజికల్ మిషన్ వారిచే ఎన్ఐఎఫ్ ప్రత్యేక పరీక్షలు చేయించగా, శీతల ప్రాంతాలలో పండే 'అన్నా', 'దోర్సెట్ గోల్డెన్' రకాలకన్నా ఇది శ్రేష్ఠమైనదిగా తేలటంతో ఎన్ఐఎఫ్ 'పిపివి & ఎఫ్ఆర్ చట్టం–2001' ప్రకారం రిజిష్ట్రేషన్‌కు హరిమన్ శర్మ పేరున దరఖాస్తు చేసింది.

హరిమాన్ శర్మకు ఈ ఆపిల్ రకం కనుగొన్నందుకు అనేక స్థానిక, రాష్ట్రీయ, జాతీయ పురస్కారాలు లభించాయి. అనేక పత్రికలు, టీవీ ఛానళ్ళు దీనిని గురించిన వార్తలను ప్రచురించి, ప్రసారం చేశాయి. స్థానిక వార్తా పత్రికలు ఇతనిని 'ఆపిల్ మాన్ ఆఫ్ బిలాస్‌పూర్' గా కీర్తించాయి. ఈయన సమతల ఉష్ణ ప్రాంతాలలో ఆపిల్ పండించే రైతులకు మార్గదర్శకుడయ్యాడు. తమ ఇళ్ళల్లో ఆపిల్ చెట్లను పెంచుకోవాలని కలలుగన్న ఎందరి కలలనో ఇతను సార్థకం చేశాడు. ఇతని వ్యవసాయ ప్రక్రియ జాతీయ, అంతర్జాతీయ కీర్తిని సాధించింది. ఈ చెట్లు కొన్నింటిని ఆంధ్రప్రదేశ్‌లోని అరకు, చింతపల్లి, లంబసింగి ప్రాంతాలలో, తెలంగాణలోని ఆమనగల్‌లోను విజయవంతంగా పెంచబడ్డాయి.

# పశువులలో 'పాలజ్వరం' మరియు 'గాలికుంటు' వ్యాధులకు మూలికా చికిత్స

**జాతీయ రెండవ బహుమతి – పశువుల వైద్యం**

**ఇన్నోవేటర్ : షేక్ హెబాజత్ హుస్సేన్, తూర్పు చంపారన్, బీహార్.**



బీహార్ రాష్ట్రానికి చెందిన తూర్పు చంపారన్ ప్రాంత నివాసి 62 సంవత్సరాల షేక్ హెబాజత్ హుస్సేన్ వ్యవసాయ దారుడే కాక, మూలికా వైద్యంలో కూడా ప్రవేశమున్నవాడు. పశువులకు సోకే 'పాల జ్వరం' మరియు 'గాలి కుంటు' వ్యాధులకు మూలికా వైద్యం చేయటం ఇతని ప్రత్యేకత.

ఇతను పాఠశాల చదువును మధ్యలోనే ఆపేశాడు. ఇతని కుటుంబంలో భార్య, ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు. బ్రతుకుతెరువుకై వ్యవసాయం మీదనే ఆధారపడ్డ కుటుంబం. తరచూ వరదలు వచ్చే ప్రాంతం అవటంతో వ్యవసాయం కూడా సజావుగా సాగదు. అదనపు ఆదాయం కోసం కొన్ని పశువులను పెంచి, పళ్ళ వ్యాపారం చేసినా, అనారోగ్యం దృష్ట్యా వాటిని కొనసాగించలేక పోయాడు.

ఇతను ఈ మూలికా వైద్యాన్ని తన గురువైన దివంగత ఉస్తాద్ మహమ్మద్ షేక్ హాజీ మున్సీ గారి వద్ద సుశ్రూష చేసి సుమారు 40 సంవత్సరాల క్రితం నేర్చుకున్నాడు. గురువుగారి దగ్గర నేర్చుకున్న విద్యతో తాను స్వంతంగా కొన్ని ప్రయోగాలు చేసి, అనేక రోగాలకు ఔషధాలను కనుగొన్నాడు. ఇప్పుడు ఆ చుట్టుప్రక్కల అనేక గ్రామాల నుండి రైతులు తమ పశువులకు సంబంధించిన వ్యాధి నివారణకు ఇతనివద్దకు సలహాకు, మందులకు వస్తూ వుంటారు. జ్ఞానాన్ని పంచటమే ఎంతో అదృష్టంగా భావించే హుస్సేన్ తనవద్దకు వచ్చేవారి వద్దనుండి ఏవిధమైన ప్రతిఫలం ఆశించడు. పశువులకు సంబంధించిన అనేక రోగాలకు ఉదాహరణకు శ్వాసకోశ వ్యాధులు, పాల జ్వరం, గాలికుంటు, ఎముకలు విరగటం, పారుకోవటం, అతిసార వ్యాధి, ఉదర సంబంధ వ్యాధులు మొదలైన అనేక వ్యాధులకు వైద్యం చేస్తూ వుంటాడు.

ఈయన తన పశువులకు చేసే వివిధ వైద్యాలకు సంబంధించిన జ్ఞానాన్ని ఎన్ఐఎఫ్‌తో పంచుకున్నపుడు ఎన్ఐఎఫ్ వారు ప్రత్యేకించి గాలికుంటు వ్యాధికి సంబంధించిన వైద్యం కొత్తగా వుండటం, ఎక్కువ ఫలితాన్ని ఇవ్వటంతో ఈ విధానాన్ని, ఆ మూలికలను పేటెంటు చేసే ప్రక్రియ ప్రారంభించింది. అంటువ్యాధి అయిన ఈ గాలికుంటు వ్యాధిలో పశువుకు తీవ్ర జ్వరం వచ్చి, బిగుసుకు పోయి, కాళ్ళు చేతులు చచ్చుపడి పోవటం, కళ్ళవెంటు పుసులు కారటం, శ్వాస సరిగ్గా తీసుకోలేక పోవటం, కాలి గెట్టెల మధ్య కురుపులు ఏర్పడటం లాంటి లక్షణాలు కలిగి వుండి సరియైన వైద్యం అందించకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదం వుంటుంది. ఇతని వైద్య ప్రక్రియను హిమాచల్ ప్రదేశ్ లోని పాలంపూర్, పశువైద్య కళాశాలలోని డా. జి.సి. నేగీ గారు మండి, కాంగ్రా ప్రాంతాల్లోని అనేక సంస్థల ద్వారా పరిశోధనలు చేసి చూడగా చాలా బాగా పని చేస్తున్నట్లు నిర్ధారించారు. వైద్యం ప్రారంభించిన మూడవ రోజుకే శ్వాస



సులభతరం అవటం, కాళ్ళల్లో శక్తి రావటం గమనించారు. రెండవ రోజుకే జ్వరం తగ్గటం గమనించారు. 6వ రోజుకే పశువు సాధారణ స్థాయికి చేరుకుంటుంది. పాలిచ్చే పశువులైతే వారం రోజుల్లో తిరిగి పాలు పితుక్కోవచ్చు.

ఈయన వైద్య పద్ధతి ఈయన స్వంతం అవునో కాదో నిర్ధారణ చెయ్యటానికి తూర్పు చంపారన్ ప్రాంతంలోని అనేక గ్రామాలలో పశు మూలికా వైద్యులను విచారించగా, ఎవ్వరు కూడా ఈ పద్ధతిని వాడుతున్నట్లు చెప్పక పోవటంతో, దీన్ని ప్రత్యేక పద్ధతిగా నిర్ధారించి, ఇతనిని బహుమానానికి ఎంపిక చేయటం జరిగింది.

## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 800/–లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు.

చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

– ఎడిటర్

# ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు

## రెండుసార్లు నాటు వేయటం ద్వారా 'క్యాబేజి, క్యాలిఫ్లవర్' పంటల అధికోత్పత్తి :

ఒరిస్సాలోని సుందర్ ఘర్ ప్రాంతంలోని స్థానిక కొండజాతివారు క్యాలిఫ్లవర్, క్యాబేజి పంటల అధికోత్పత్తికి ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. ముందుగా విత్తనాలను నారుమడిలో పోసి, మారాకు మొలకెత్తిన తర్వాత ఆ మొలకలను జాగ్రత్తగా తీసి ఇంకొక మడిలో నాటాలి. అక్కడ మొక్కకి దాదాపు ఎనిమిది ఆకులు వచ్చేవరకు ఉంచాలి. ఆ తర్వాత వాటిని తీసి పొలంలో నాటినచో ఆ మొక్క బలంగా, ఆరోగ్యంగా ఉండటంతో పాటు, అధికోత్పత్తిని ఇస్తాయి. షెడ్యూల్డు తెగలకు చెందిన రైతు గణనాథ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పద్ధతిని ఉపయోగించి, అధికోత్పత్తిని సాధించాడు.



## కాకర ఆకుల రసంతో పశువుల పుండ్లకు వైద్యం :

పశువులకు దెబ్బలు, పుండ్లను అలాగే వదిలేస్తే అవి చీము పట్టి సెప్టిక్ అయ్యే ప్రమాదముంది. ఒరిస్సాలోని తర్చర్ అనే గ్రామ ప్రజలు తాజా కాకర ఆకులను మెత్తగా దంచి, ఆ ముద్దను పశువుల పుండ్లు, గాయాలపై పూయటం ద్వారా అవి త్వరగా మానిపోవటం జరుగుతోంది. దీనివలన గాయాలు త్వరగా మానటమే కాకుండా, క్రిమి కీటకాలను కూడా దరి చేరకుండా నిరోధిస్తుంది. ముద్దగానే కాకుండా కాకర ఆకులను చేతితో నలిపి ఆ రసాన్ని గాయంపై వేస్తే కూడా గుణం కనిపిస్తుంది. ప్రకాష్ అనే రైతు ఈ పద్ధతిలో చాలా



పశువులకు ఉపశమనం కలిగించాడు.

## నిమ్మజాతికి చెందిన దబ్బ (కర్ణ) కాయ చెట్ల ఆకులతో పశువులలో నులిపురుగుల నివారణ :


ఒరిస్సా రాష్ట్రంలోని పూరి, అంగూల్, కలహంది ప్రాంతాల్లోని ప్రజలు దబ్బ (కర్ణ) కాయలను ఆహారంలో వాడుతారు. కానీ లక్ష్మీబెన్ (60 సం.) ఈ చెట్ల ఆకులను పశువులలో నులి పురుగుల నివారణకు వాడుతుంది. ఆమె



మూడు నాలుగు ఆకుల రసానికి కొద్దిగా ఉప్పు కలిపి, 150 మి.లీ. నీటిలో కలిపి జ్యూస్ తయారు చేసి పశువులచేత తాగిపిస్తుంది. దీంతో పశువుల కడుపు శుభ్రపడి కడుపు నొప్పితో పాటు నులి పురుగులు కూడా నివారించబడతాయి. ఈ పద్ధతిలో ఈమె ఎన్నో దూడలకు వైద్యాన్ని చేసింది.

**ప్రత్తి నాటడంలో నర్సరీ పద్ధతి :**

గుజరాత్‌కు చెందిన కేశవ్‌భాయ్ 1999 నుండి తన పొలంలో 'శంకర్-4' అనే హైబ్రిడ్ ప్రత్తిని నాటేవాడు. వర్షాలు బాగుంటే ఫర్వాలేదు కాని, వర్షాభావ పరిస్థితుల్లో పొలంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్తి మొక్కలు ఏపుగా పెరగక పోవడాన్ని గమనించాడు. ఈ సమస్య పరిష్కారం కొరకు అతను పొలంలో ప్రత్తి నాటినప్పుడే కొన్ని విత్తనాలను నర్సరీ పద్ధతిలో విడిగా కుండీలలో పెంచాడు. వీటిని 25 గ్రా. ఆవుపేడ, 50 గ్రా. మట్టి కలిపి అందులో మొక్కలు నాటేవాడు. తక్కువ ఎండ వుండేచోట వీటిని తగినంత నీరు పోసి 25 నుండి 30 రోజుల వరకు పెంచుతాడు.



ఈలోగా పొలంలో వేసిన ప్రత్తి మొక్కలలో ఏవైనా మొలకెత్తకపోయినా, లేదా సరియైన ఎత్తుకు ఎదగకపోయినా ఈ కుండీలలోని మొక్కలను అక్కడ నాటేస్తాడు. దాంతో పొలంలోని మొక్కలన్నీ ఒకే ఎత్తులో, ఒకే వయస్సులో వుండటం వల్ల ఒకేరకమైన కాపు ఇస్తున్నాయి. కేశవ్ భాయ్‌ని చూసి చుట్టుప్రక్కల ప్రాంతాల్లోని చాలామంది రైతులు ఇదే పద్ధతిని అవలంభించి, వనరులను మితంగా వాడటమే కాకుండా, అధికోత్పత్తిని సాధిస్తున్నారు.

**పశువులు చూలుకు రావటానికి చిట్కా :**


పశువులలో వేడి అధికమైనపుడు అవి చూలుకు రాకపోవడమే కాదు, పాల దిగుబడి కూడా తగ్గుతుంది. దీనికి విరుగుడుగా గుజరాత్‌కు చెందిన భారత్ సిన్హా ఒక కిలో 'శతావరి' అనే ఔషధ మొక్క వేళ్ళు, ఒక కిలో మర్రిచెట్టు బెరడు కలిపి మెత్తగా పొడిచేసి రోజుకు 500 గ్రా.ల చొప్పున, నాలుగు రోజులపాటు పశువుకు దాణాలో కలిపి తినిపిస్తే మంచి ఫలితం వుంటుందని, ఒక వారంలో పశువు చూలుకు సిద్ధమవుతుందని అంటున్నాడు. ఈ చిట్కాను ఇతను తన తండ్రి రామ్‌సింగ్ భాయ్ వద్ద నేర్చుకున్నానని, ఆయనా ఇదే పద్ధతిని అవలంభించేవాడని చెబుతున్నారు.



**పశువులు తొందరగా 'మాయి' వేయటానికి మర్రి ఆకులతో వైద్యం :**

పశువులకు దూడ పుట్టిన తరువాత తల్లి కడుపులో నుండి తొందరగా మాయి బయటకు రాకపోతే తల్లి పశువుకు రక్తస్రావం, అంటులోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కనుక త్వరగా మాయి వేయటమన్నది కొన్ని గంటల్లో పూర్తి కావాలి. ఈ సందర్భంలో లేత మర్రి ఆకులను దంచి దానిలో 500 గ్రా. సజ్జపిండి, ఒక లీటరు పాలను కలిపి పశువుచేత తాగిపిస్తే మాయి తొందరగా వేస్తుంది.

ఇదే చికిత్సను స్త్రీలకు కూడా గర్భస్రావం అయితే కూడా ఉపయోగించవచ్చు అంటారామె. దీనివల్ల పునరుత్పాదక అవయవాల ఆరోగ్యం, అందం పుట్టడము మళ్ళీ సవ్యంగా జరుగుతాయట.)




### పశువులలో వడదెబ్బకి పరిష్కారం :

ఎండాకాలంలో పశువులకు వడదెబ్బ తగిలితే 200 గ్రా. శతావరి ఆకులను నీటిలో (ఆకులు మునిగే వరకు) నానబెట్టి ఆ ఆకులను పశువుల నుదుటిమీద రోజు విడిచి రోజు వరుసగా వుంచితే పశువులను వడదెబ్బ బారినుండి కాపాడవచ్చు అంటున్నారు గుజరాత్‌కు చెందిన సునేంద్ర నగరవాసి భవన్‌భాయ్ మారుభాయ్ రాజ్‌పుత్.



### పప్పు ధాన్యాలను పురుగులనుండి కాపాడుకోవటం :

పప్పు ధాన్యపు పంటలలో గొంగళి పురుగు బారినుండి రక్షించుకోవటానికి రెండున్నర కిలోల 'అదుసి' ఆకులను, అంతే ప్రమాణంలో కానుగ ఆకులను నీటిలో నానబెట్టి వడగట్టి పురుగు పట్టిన పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితాన్నిస్తుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రానికి చెందిన



సురేంద్రనగర్ నివాసి ప్రతాప్ భాయ్ ప్రభు భాయ్ రబారి.


### పశువులలో కాళ్ళ వాపులకి తంగేడు ఆకులతో చికిత్స :

పశువులలో బెణుకుల వలన వచ్చిన వాపుల నివారణకై తంగేడు ఆకులను దంచి, కొద్దిగా వేడిచేసి, వాపు వున్న ప్రాంతంలో పూసినట్లయితే వాపులు త్వరగా తగ్గి, పశువులకు స్వస్థత చేకూరుతుంది అంటున్నారు గుజరాత్‌కు చెందిన సురేంద్ర నగర్ వాసి గీతాబెన్ ఘన్‌శ్యాంభాయ్ మణేక్.



## పశు సంపదను కాపాడుకుందాం

పాఠకులకో మనవి. మారుతున్న కాలంలో సాంప్రదాయ పశువైద్యులు కనుమరుగై పోతున్నారు. అక్కడక్కడా వున్న వారి జ్ఞానం వారితోనే అంతం కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలంటే అటువంటి వైద్యాలు గ్రంథస్తంచేయటం ఎంతో అవసరం. మీకు తెలిసిన పశువైద్యులు ఎవరైనా వుంటే వారి జ్ఞానాన్ని మాతో పంచుకోండి. ప్రచురించి అందరికీ అందజేద్దాం. **- ఎడిటర్**



## డా. ఎపిజె అబ్దుల్ కలాం

# ఇగ్నైట్

## పోటీలు 2019

> "నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
> సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
> ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
> జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది"

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2019'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2019.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

పూర్తి వివరాలకు సంప్రదించండి :
www.nif.org.in/ignite


National Innovation Foundation-India
Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,
Gandhinagar - 382650, Gujarat, India.
Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803
E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite


dst.gov.in honeybee.org gian.org sristi.org cbse.nic.in

# ఆయుర్వేద జ్ఞాన మధనం

# చక్కెర భయంకరమైనది - బెల్లం ఆరోగ్యకరమైనది

ప్రస్తుతం దాదాపు ప్రతి కుటుంబంలో 'మధుమేహం' (చక్కెర) వ్యాధిగ్రస్తులు లేని కుటుంబం ఉండదేమో అనిపిస్తుంది. ఈ వ్యాధి వచ్చినవారు నిరంతరం మాత్రలు తీసుకుంటునే వున్నారు. అందుకే ఈ వ్యాధి రాకుండా వుండేందుకు జాగ్రత్తలు, వచ్చినవారు దాన్ని నియంత్రణలో పెట్టుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ షడ్రుచులు (తీపి, చేదు, కారం, వగరు, పులుపు, వగరు, ఉప్పు) కలిగిన ఆహారాన్ని ఎల్లప్పుడూ తీసుకుంటూ వుంటే మంచిది. ఇవి శరీరంలో సమశీతోష్ణాన్ని కలిగిస్తూ వుంటాయి. వీటి కలయికతో నిత్యం వంటలు చేసుకునే వారి ఇళ్ళల్లో మధుమేహం, గుండె జబ్బులు లాంటి వ్యాధులు రాకుండా ఉండటమే కాదు, ఆరోగ్యంగా కూడా ఉంటారు. వీటిలో చాలామంది తీపి లేదా కారం మాత్రం ఎక్కువగా తీసుకుంటూ వుంటారు. పులుపు, వగరు, చేదులను ఆహారంలో చాలా తక్కువగా తీసుకుంటూ వుంటారు, లేదా కొందరు అస్సలు తీసుకోవటం లేదు. అందువల్లనే ఇప్పుడు 5 మంది కుటుంబంలో ముగ్గురు లేదా నలుగురు మధుమేహానికి గురవుతున్నారు.

ఎండాకాలంలో చాలామంది బయటకు వెళ్ళి వచ్చిన వెంటనే సేద తీరటానికి నిమ్మరసంలో చక్కెర కలుపుకుని తీసుకుంటూ వుంటారు. మనిషి అస్సలు వాడనే కూడని ద్రవం ఇదని నా అభిప్రాయం అంటారు ఉమామహేశ్వరరావు.



మద్యం సేవించేవారికి ఎలా లివర్ పాడైపోతుందో అంతటి ప్రమాదమైనది ఈ నిమ్మరసం పంచదార కలిపిన ద్రావణం అంటారు. దీన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ వారు కూడా హెచ్చరించారు అంటాడాయన. మనం తినే ఆహారంలో మనిషికి కావలసినంత క్యాల్షియం తప్పకుండా వుంటుంది. ఈ నిమ్మరసంలో కలిసే పంచదార వల్ల క్యాల్షియం అధిక మోతాదులో పెరిగి తీవ్ర నష్టానికి గురిచేస్తుంది. ఉప్పు, మద్యంకన్నా భయంకరమైనది పంచదార. గుట్కా, సిగరెట్ ప్యాకెట్లపైన ఆరోగ్యానికి హానికరం అని ఎలా ముద్రిస్తున్నారో అలాగే చక్కెర ప్యాకెట్లపైన కూడా తప్పకుండా ముద్రించడం చాలా అవసరమన్నది అతని అభిప్రాయం. అలా చేయటం వల్ల పంచదార ఎందుకు హానికరం అని ప్రజలు తెలుసుకునే అవకాశముంటుంది. ఈ పంచదార వినియోగం పెరగటం వల్ల ఊబకాయాలు ఎక్కువగా పెరిగి అనేక జబ్బులకు గురవుతున్నారు. ఈ రోగాలన్నిటికి ప్రధాన కారణం 'చక్కెర' అన్న విషయం మరువకూడదు.

చాలామంది తెలిసినా, తెలియకపోయినా సరే మార్కెట్లో లభించే కూల్‌డ్రింక్స్ సేవిస్తూ వుంటారు. వాటిల్లో ఒక గ్లాసు కూల్ డ్రింక్‌లో దాదాపు 10 చెంచాల పంచదార కలిసి వుంటుంది. పైగా కూల్ డ్రింక్స్‌లలో 'ఫాస్పరిక్ యాసిడ్' ను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీన్ని వేయటం వల్ల పంచదార కడుపులోకి వెళ్ళగానే వాంతులు, తిప్పటం లాంటివి రాకుండా చేస్తుంది. అందువల్ల కూల్‌డ్రింక్స్ తాగటం వల్ల చక్కెర నేరుగా రక్తంలో కలిసిపోయి, షుగర్ లెవెల్స్ విపరీతంగా పెరిగిపోతూ వుంటాయి. రెండు మూడు కప్పుల టీ లేదా కాఫీ తాగటం వల్ల కొద్దిగా ఫరవాలేదు కాని, కూల్ డ్రింక్ మాత్రం చాలా ప్రమాదకరమైంది. పట్టణాల్లో కొందరు 10 నుంచి 50 దాకా టీ కాఫీలు త్రాగుతూ వుంటారు. అలాంటి వారికి లివర్ జబ్బులు త్వరగా వచ్చే అవకాశముంటుంది. వీటి నివారణకు నీరు ఎక్కువగా సేవించటం అత్యంత ఉత్తమం.

పిల్లలకు పాలిచ్చే తల్లులు కూడా టీ కాఫీలు ఎక్కువగా త్రాగకూడదు. ప్రస్తుతం గ్రీన్‌టీ ఎక్కువగా ప్రాచుర్యంలోకి వస్తోంది. వాటిలో నాణ్యమైనది ఎన్నుకుంటే మంచిదే కాని, వాటిల్లో కూడా కల్తీ ఎంతవరకు వుంటుందో తెలుసుకుని

సేవిస్తే మంచిది. ఈ గ్రీన్ టీలలో ఒంటె లద్దెలు (పేడ) పొడి చేసి వీటిల్లో కలుపుతున్నట్లు తెలుస్తోంది. పంచదార అధిక రక్తపోటుకు కూడా ఒక ప్రధాన కారణం.

మధుమేహం రాకుండా వుండేందుకు నాలుగు పద్ధతులు :

1. రోజుకు నాలుగైదు సార్లు నీటిని నోట్లో వేసుకుని ఒక నిమిషం పాటు బాగా పుక్కిలించి ఉమ్మటం. ఇలా చేయటం వల్ల లాలాజలం ఉత్పత్తి బాగా పెరుగుతుంది. ఈ లాలాజలం మన శరీరంలో బాగా పెరిగితే చాలా రోగాలను రానీయకుండా చేస్తుంది. దీన్ని మించిన యాంటీ బయాటిక్ ప్రపంచంలో లేదు. ఈ లాలాజలం కొంటే లభించేది కాదు, ఒకరు మరొకరికి ఇచ్చేది కూడా కాదు. ఎవరికి వారు చేసుకోవాల్సిన క్రియ.

2. శరీరాన్ని సమశీతోష్ణంగా ఉంచటానికి మట్టి నేలపై చెప్పులు లేకుండా నడవటం ఉత్తమమైన మార్గం. రోజూ ఉదయం, సాయంత్రం కొద్దిసేపైనా మట్టిపైన చెప్పులు లేకుండా నడవ గలుగుతారో వారికి మధుమేహం, రక్తపోటులే కాదు, గుండె జబ్బుల లాంటి తీవ్ర వ్యాధులు కూడా దరిచేరవు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ చాలా జీవరాసులు మట్టినేలపైనే సంచరిస్తూ వుంటాయి, వాటికి మధుమేహం, రక్తపోటు లాంటి రోగాలేవీ వుండవు. మట్టిమీద నడవటం అనేది ప్రకృతి ధర్మాన్ని పాటించటమే. దానివల్ల మనిషి లాభం చేకూరుతుందే కాని, ఎటువంటి నష్టమూ వుండదు.

3. ఆహారాన్ని బాగా నమిలి తినటం. ఏ ఆహారం తిన్నా నమలకుండా మింగటం మంచిది కాదు. ఎంత బాగా నమిలి తింటే శరీరానికి అంత మంచిది. భోజనం చేసేటప్పుడు కూడా నేలపైన కూర్చుని బాగా నమిలి తినటం ఉత్తమం. ఏదైనా





ఆహారాన్ని కూర్చుని తీసుకోకపోవటం కూడా శరీరంలో మధుమేహం పెరగటానికి ఒక కారణం.

4. భోజనానికి ముందు లేదా తర్వాత జావ త్రాగటం ఆరోగ్యానికి చాలా మంచిది. రాగులు, సజ్జలు, జొన్నలు లాంటి వాటితో తయారు చేసిన జావ తీసుకోవటం వల్ల తిన్న ఆహారం చాలా బాగా శరీరానికి అందిస్తుందీ చర్య. వీటిని పొడి చేసి పెట్టుకుని, నీటిలో బాగా మరిగించి కొద్దిగా ఉప్పు వేసుకుని కానీ లేదా ఏదీ లేకుండా కానీ తీసుకోవటం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ జావను తీసుకోవటం వల్ల రక్తం బాగా పలుచబడి చక్కెర లెవెల్స్ పెరగకుండా కాపాడుతుంది. అందుకే పూర్వం ఉదయం లేవగానే రాగి, సజ్జలతో చేసిన జావ త్రాగి పనులకు వెళ్ళేవారు. ఇప్పటికీ కొందరు ఈ పద్ధతిని పాటిస్తున్నారు. అటువంటి వారు ఎటువంటి అనారోగ్యానికి గురి కాకుండా ఆనందంగా జీవనం కొనసాగిస్తున్నారు. భోజనం చేయటంలో కూడా సమయపాలన చాలా మంచిది.

పై నియమాలను పాటించేందుకు పెద్దగా ఖర్చయ్యేది లేదు. మీరు ఏ ఆహారం ఎలా తీసుకున్నా సరే తినేటప్పుడు నేలపై కూర్చుని బాగా నమిలి తినటం, మట్టి నేలపై కొద్దిసేపైన చెప్పులు లేకుండా నడవటం, సూర్య కిరణాలకు ఎదురుగా కొంత సమయం గడపటం వల్ల శరీరంలో ఎన్నో చర్యలు జరిగి ఎన్నో రుగ్మతలను దరిచేరకుండా చేస్తాయీ చర్యలు. వీటిని అందరూ పాటించి మీ ఆరోగ్యాలను కాపాడుకుంటారని ఆశిస్తోంది పల్లెసృజన.

**పలివెల ఉమా మహేశ్వర రావు, ఆయుర్వేద వైద్యులు, మణుగూరు, ఖమ్మం జిల్లా. ఫోన్: 9440286854**

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040-27111959**) సంప్రదించండి.

## రైతుల కోసం రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు

# నిమటోడ్స్ నివారణకు ఆయుర్వేద పురుగు మందు

'పల్లెసృజన' ఇన్నోవేటర్ "గల్లా చంద్రశేఖర్" తయారు చేసిన "నిమటోడ్స్" పురుగు మందు అద్భుతంగా పని చేస్తుందనటానికి మరో ఉదాహరణ పాఠకుల కోసం అందిస్తున్నాము.

కర్నూలు జిల్లా కల్లూరు మండలం లోని 'బొల్లవరం' అనే గ్రామానికి "జాంపండ్ల బొల్లారం' అనే పేరుండేది. ఆ గ్రామం నుండి ఒకప్పుడు రోజుకు రెండు బస్సులు/ లారీలు కేవలం జాంపండ్లను సమీపంలోని కర్నూలు లేదా ఇతర మార్కెట్లకు సరఫరా చేసేటంతటి చరిత్ర ఆ గ్రామానిది. ఆ గ్రామానికి తూర్పు వైపున తుంగభద్రానదికి ఉపనదియైన 'హంద్రీనది' ప్రవహిస్తూ వుంటుంది. ఈ హంద్రీనది ఒడ్డు పొడవునా జామచెట్లతో ఆ గ్రామం శోభాయమానంగా ఉండేది. అటువంటి గ్రామానికి ఎవరో చేతబడి చేసినట్లు కొన్ని వందల సంవత్సరాల వయస్సున్న చెట్లతో సహా గ్రామంలోని జామ చెట్లన్నీ కేవలం రెండు మూడు సంవత్సరాల్లో సమూలంగా చనిపోయాయి.

ఆ తర్వాత ఇక మన ఊరి పొలానికి జామచెట్లు బ్రతకవు అని ఆ పొలాన్నంతా కూరగాయలు, ఇతర పంటలు వేసుకుంటూ జీవనం సాగించారు ఆ గ్రామ రైతులు. కొద్ది కాలం తర్వాత ఒకప్పుడు ఇంతటి ఆర్థిక పుష్టిని కలిగించిన జామచెట్లను మళ్ళీ పెంచుదామని కొందరు యువ రైతులు పూనుకున్నా అవి కూడా కొన్ని చనిపోతూ వచ్చాయి. ఆ గ్రామం మా స్వగ్రామం (పల్లె వీరరాఘవ రెడ్డి గ్రామం) కావటంతో నా అనుంగు శిష్యుడు 'సుగాలి మస్తాన్' అనే యువ రైతు మూడు నెలల క్రితం జామచెట్లు నాటాడు. వాటిలో పదిహేను దాకా చనిపోయాయి రెడ్డీ అని అని నేను ఈమధ్య మా గ్రామానికి వెళ్ళినపుడు చెప్పటంతో నేను వెంటనే నావెంట వున్న చంద్రశేఖర్ నిమటోడ్స్ నివారణ మందు ఇచ్చి 'వెంటనే దీన్ని నీ చెట్లన్నిటికీ చల్లెయ్య'మనటంతో అతను వెంటనే తన జామచెట్లన్నిటికీ మందును ఇసకలో కలుపుకుని చల్లి, చెట్లకు నీరందించాడు.

రెడ్డి మాట ఎందుకు కాదనాలిలే చూద్దాం ఆయన నాకు తప్పుడు సలహా ఏమీ ఇవ్వడుకదా అనుకుని తన జామచెట్లకు మందు జల్లిన వారం రోజుల తర్వాత ఆ రైతే ఆశ్చర్యపోయేట్లుగా పూర్తిగా చనిపోయినవి అనుకుని, కేవలం కర్రలు మాత్రమే మిగిలి వున్న చెట్లన్నీ మళ్ళీ ఇగుర్లు వేయటంతో తన ఆనందం తట్టుకోలేక వెంటనే నాకు ఫోన్ చేసి "రెడ్డీ చనిపోయాయి అనుకున్న నా జామచెట్లన్నీ లాకలు వేయటమే కాదు, తోట కూడా మంచి రంగులో నిగనిగలాడుతుంది" అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు.

ఈ అద్భుతమైన మందు కనిపెట్టిన 'రాష్ట్రపతి పురస్కార గ్రహీత' చంద్రశేఖర్ గారి 'నిమటోడ్స్ నివారణ' మందును ఉపయోగించుకుని రైతులు చీని, జామ, మిరప, వేరుశనగ లాంటి పంటలను కాపాడుకుంటారని ఆశిస్తోంది 'పల్లెసృజన'.

రైతు పేరు : **మస్తాన్ నాయుడు, బొల్లవరం గ్రామం, కల్లూరు మండలం, కర్నూలు జిల్లా.**

ఫోన్ నెం. : **9963368834/ 6300223241**







కావాల్సిన వారు సంప్రదించండి :

**పల్లెసృజన,** ప్లాట్ నెం. 77, రోడ్ నెం.2, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.

ఫోన్ : **8125799904**

PALLESRUJANA Telugu Bi-monthly November-December 2018 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**



























**పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.**

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 350/- | 1,400/- |
| ఐదు సంవత్సరాలకి | 800/- | 3,200/- |

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904